ప్రజాశక్తి

బుధవారం 21 ఫిబ్రవరి 2024

8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి

చప్పగా శంఖారావం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన పాదయాత్రలో పాత అంశాలే తప్ప కొత్త ఆలోచనలు రేకెత్తించే అంశాలేవీ లేవు. ప్రభుత్వంపై విమర్శలు, ఆకర్షణీయ ప్రతిపాదిత పథకాలు తప్ప శాశ్వత అభివృద్ధికి దోహదపడే ప్రకటనలు చేయలేదు. హామీలు ఇవ్వలేదు. రాబోయే ఎన్నికల్లో టిడిపి, జనసేన కార్యకర్తలు కలిసి పనిచేసే వాతావరణం కిందిస్థాయిలో కలిగించేందుకు చేసిన ప్రయత్నంలా లోకేష్ శంఖారావం కొనసాగింది తప్ప అధికారంలోకి వస్తే తమ ప్రభుత్వం చేపట్టేబోయే అభివృద్ధి నమూనా ఎలావుండబోతుందో చెప్పలేదు. తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీ రైతులను ఆదుకుంటామన్న ఆయన... ఆధునికీకరించి పునరుద్ధరిస్తామన్న హామీ ఇవ్వలేదు. ఏటికొప్పాక, తాండవ సుగర్ ఫ్యాక్టరీలు వైసిపి ప్రభుత్వంలో మూతపడ్డాయని విమర్శలు చేశారు తప్ప తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వాటిని తెరిపించి రైతుల అవసరాలకు తగినట్లు తీర్చిదిద్దుతామని చెప్పకపోవడంతోనే చక్కెర ఫ్యాక్టరీల పట్ల టిడిపి వైఖరి మరోసారి స్పష్టమైంది. ఆయా నియోజకవర్గ సభల్లో ఎమ్మెల్యేలపై విమర్శలకు లోకేష్ పరిమితమయ్యారు తప్ప నియోజకవర్గంలోని సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి తమ అజెండాను వివరించలేదు.

ఉత్తరాంధ్ర సుజల స్రవంతి సహా ఏలేరు, తాండవ అనుసంధానం, పోలవరం ఎడమ కాలువ పనులు, నిర్వాసితుల సమస్యలు, పరిశ్రమల్లో స్థానికులకు ఉపాధి, కనీస వేతనాలు అమలు, నాన్‌షెడ్యూల్ ప్రాంతాన్ని ఐదో షెడ్యూల్‌లో చేర్చడం, కాలుష్య నియంత్రణ చర్యలు, పరిశ్రమల్లో ప్రమాదాల నివారణ వంటి పలు ప్రధానాంశాలను ఆయన విస్మరించారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరించడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్న మోడీ ప్రభుత్వంపై పల్లెత్తుమాట అనలేదు. తీర ప్రాంతంలో రసాయన పరిశ్రమల కారణంగా దెబ్బతింటున్న మత్స్యకారుల జీవనోపాధి పరిరక్షణకు ఎటువంటి భరోసా ఇవ్వలేదు. ఎన్నికల్లో గెలిపించాలని పదేపదే అభ్యర్థించడమేగానీ, గెలిపించిన ప్రజలను ఎలా ఉద్ధరించబోతున్నదీ చెప్పే ప్రయత్నం చేయలేదు. వైసిపి ప్రభుత్వం కంటే వివిధ పథకాల కింద ఎక్కువ ఆర్థిక ప్రయోజనాలు కల్పిస్తామని ప్రజలను నమ్మించడానికి లోకేష్ ప్రయత్నించారు. చివరకు నియోజకవర్గాల్లో ఆయన శంఖారావం చప్పగా సాగింది.

మాడుగుల శంఖారావం సభలో మాట్లాడుతున్న లోకేష్

- విమర్శలకే ప్రాధాన్యం కానరాని అభివృద్ధి అజెండా
- సుగర్ ఫ్యాక్టరీల పునరుద్ధరణపై నోరుమెదపని లోకేష్

భూములమ్మి..

స్టీల్‌ప్లాంట్ రక్షణ సాధ్యమేనా ?

సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : 'మోడీ ప్రభుత్వం విశాఖ ఉక్కు భూములమ్మి స్టీల్‌ప్లాంట్‌ను రక్షించగలదా.. నడిపించ గలదా.. ! ఇది సాధ్యమయ్యే పనేనా..? మనిషికి రోగం ఒకటైతే మందు ఒకటి వేసినట్లు కేంద్రం చర్యలు ఉన్నాయి' అని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు తెలిపారు. మంగళవారం ఆయన పార్టీ జిల్లా కమిటీ తరుపున ఓ ప్రకటన విడుదల చేశారు. ప్లాంట్ నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం ఐదు వేల కోట్లు వర్కింగ్ క్యాపిటల్ ఇవ్వాలని కార్మికుల న్యాయమైన డిమాండ్‌గా ఉందన్నారు. లేనిపక్షంలో బ్యాంకుల నుండి రుణం ఇప్పించాలని కోరుతున్నారన్నారు. మూడు లక్షల కోట్ల విలువగల స్టీల్‌ప్లాంట్ ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు లక్ష మందికి ఉపాధి కల్పిస్తోందని తెలిపారు. దీనికి కేవలం రూ.5000 కోట్లు ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వానికి ఎందుకు అభ్యంతరమని ప్రశ్నించారు. బ్యాంకులు రుణాలు ఇవ్వకుండా ఎందుకు ఆటంకపరచాలన్నారు. కార్పొరేట్ మిత్రులకు లక్షల కోట్లు రుణాలు, పన్ను రాయితీలను కేంద్రం ఇస్తోందని తెలిపారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు మాత్రం ఏ విధమైన సాయమూ అందించడం లేదన్నారు. ప్లాంటును ఆర్థికంగా దెబ్బతీసి, నష్టాలపాలు చేసి తన కార్పొరేట్ మిత్రులకు కారుచౌకగా కట్టబెట్టాలన్న కుట్ర ఇందులో స్పష్టంగా దాగి ఉందని జగ్గునాయుడు తెలిపారు. ప్లాంటుకు విశాఖ నగరం, ఆటోనగర్ ప్రాంతాల్లోని ఉన్న భూములను ప్రభుత్వం వేలం వేస్తోందని, అలా భూములు వేలం వేసి, ఆస్తులు అమ్ముకుంటూ పోతే ప్లాంటును ఎంతకాలం నడపగలరు.. రక్షించగలరని అన్నారు. బ్లాస్ట్ ఫర్నేస్ 3ని జిందాల్‌కు కట్టబెడితే ఉత్పత్తి బాగా పెరుగుతుందని, ఇది సర్వరోగ నివారిణి అని కేంద్ర బీజేపీ ప్రభుత్వం, స్టీల్ యాజమాన్యం ఊదరగొట్టాయన్నారు. దీనిని కట్టబెట్టి రెండు నెలలు అయిందని, పూర్తి ఉత్పత్తి చేయగలుగుతున్నారా ? అని ప్రశ్నించారు. ఇది జిందాల్ సంస్థకు ప్రయోజనం తప్ప ప్లాంట్‌కు, కార్మికులకు ఏం ప్రయోజనమని అన్నారు. కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించి, వర్కింగ్ క్యాపిటల్ అందించి, ప్లాంట్‌ను పూర్తిస్థాయి సామర్థ్యంతో నడిపించడానికి ఎటువంటి ఆటంకాలు లేకుండా సహకరిస్తే సంవత్సరంలో లాభాలు బాట పట్టిస్తామని స్టీల్ కార్మికుల రోదన మోడీ ప్రభుత్వం ముందు అరణ్య రోదనగా ఉందన్నారు. ఇప్పటికైనా కేంద్ర బిజెపి ప్రభుత్వం త్యాగాల విశాఖ ఉక్కును బలహీనపరిచే చర్యలను, కుట్రలను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. సంస్థకు వర్కింగ్ క్యాపిటల్ మిగతా 2లో..

కేంద్రీయ విద్యాలయం మూసివేతపై ధర్నా

వార్త 2లో..

కెజిహెచ్‌లో నవ్య సేవలు ప్రారంభం

వార్త 2లో..

నేడు రాజశ్యామలయాగంలో సిఎం జగన్

వార్త 4లో..

ఆకట్టుకున్న బాంబు విస్ఫోటన విన్యాసం

ఆకట్టుకున్న మిలాన్ రిహార్సల్స్

బీచ్ రోడ్డులో పలు దేశాల ప్రతినిధులు కవాతు

వార్త మెయిన్‌లో..

జివిఎంసి అభివృద్ధి పనులకు స్థాయీ సంఘం ఆమోదం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నగరంలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు జివిఎంసి స్థాయీ సంఘం ఆమోదం తెలిపిందని స్థాయీ సంఘం చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకట కుమారి వెల్లడించారు. మంగళవారం ఆమె అధ్యక్షతన జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని స్థాయీ సంఘం సమావేశ మందిరంలో స్థాయి సంఘం సమావేశం నిర్వహించారు. 136 అజెండాలతో పాటు 51 టేబుల్ అజెండాలతో కలిపి మొత్తం 187 అంశాలు పొందుపరిచారు. వీటిని స్థాయీ సంఘంలో సభ్యులు చర్చించి ఆమోదించారని చైర్‌పర్సన్ తెలిపారు. రెవెన్యూ విభాగానికి చెందిన లీజుల పొడిగింపు, గుత్తలు, ఆశీలు వసూళ్లకు సంబంధించినవి ఆమోదించిన వాటిలో ఉన్నాయన్నారు. పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి పలు ప్రాంతాలలో భవన నిర్మాణ వ్యర్థాలు తొలగింపునకు రూ.12.30 లక్షలు వెచ్చించేందుకు, ప్రజా ఆరోగ్య విభాగానికి సంబంధించి పలు వార్డులలో తాత్కాలిక పద్ధతిపై అదనపు పారిశుధ్య కార్మికులను ఏర్పాటు చేసేందుకు, జెసిబిలతో వ్యర్థాలు తొలగింపునకు మిగతా 2లో..

సదస్సులో పాల్గొన్న డ్వాక్రా మహిళలు, ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న పుణ్యవతి

సున్నా వడ్డీ రుణాలు ఇవ్వాలి

ఐద్వా సదస్సులో సంఘం జాతీయ కోశాధికారి పుణ్యవతి

వార్త మెయిన్‌లో..

మొదటి పేజీ తరువాయి..

భూములమ్మి స్టీల్‌ప్లాంట్ రక్షణ సాధ్యమేనా ?

సహా పూర్తిస్థాయి సామర్థ్యంతో నడిపించేందుకు అన్ని చర్యలు తక్షణమే చేపట్టాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ఇటువంటి నిర్ణయం తీసుకునేలా రాష్ట్ర ముఖ్యమంత్రి, తెలుగుదేశం, జనసేన అధినేతలు ప్రధానమంత్రిపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ద్రోహానికి పాల్పడిన బిజెపికి, దానికి ఊడిగం చేసే పార్టీలకు విశాఖ ఉక్కు కార్మికులు, ప్రజానీకం తగిన గుణపాఠం చెప్పక తప్పదని హెచ్చరించారు.

జివిఎంసి అభివృద్ధి పనులకు స్థాయీ సంఘం ఆమోదం

రూ.2.23 కోట్లు, అలాగే ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి సుమారు రూ.47.41 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు స్థాయీ సంఘం ఆమోదం తెలిపిందన్నారు. ఈ సమావేశంలో స్థాయి సంఘం సభ్యులతో పాటు పట్టణ ప్రణాళిక అధికారి సురేష్ కుమార్, కార్యదర్శి నల్లనయ్య, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, డిసి(ఆర్) ఎస్.శ్రీనివాస్, జోనల్ కమిషనర్లు కె.కనకమహాలక్ష్మి, విజయలక్ష్మి, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి, కార్యనిర్వాహక ఇంజినీర్లు పాల్గొన్నారు.

కెజిహెచ్‌లో నవ్య సేవలు ప్రారంభం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కెజిహెచ్‌లోని కేన్సర్ సేవల్లో నవ్యతకు అంకురార్పణ జరిగింది. కేన్సర్ రోగుల జీవన ప్రమాణాలను మెరుగు పరిచేందుకు కృషి చేస్తున్న జాతీయ స్థాయి స్వచ్ఛంద సేవా సంస్థ 'నవ్య'తో పాటు బాధితుల ప్రాణాలు కాపాడేందుకు పాటుపడుతున్న టాటా మెమోరియల్ ఆసుపత్రి సౌజన్యంతో నేషనల్ కేన్సర్ గ్రిడ్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో కెజిహెచ్‌లో నవ్య ప్రాజెక్టు కార్యకలాపాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. రేడియేషన్ ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ పాండురంగ కుమారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో టాటా మెమోరియల్ అనుబంధ హోమీ బాబా కేన్సర్ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ ఉమేష్ మహంత్ శెట్టి, కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్, ఆంధ్ర మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.బుచ్చిరాజు, నవ్య ప్రతినిధి డాక్టర్ నీతి మాథుర్, వ్యవస్థాపకులు డాక్టర్ నరేష్ రామరాజన్, మెడికల్ ఆంకాలజీ, సర్జికల్ ఆంకాలజీ విభాగాధిపతులు డాక్టర్ శిల్ప, డాక్టర్ రాఘవేంద్ర నాయక్, సిఎస్ఆర్ఎమ్ఒ డాక్టర్ లక్ష్మీ తులసి, పలువురు వైద్యులు సంయుక్తంగా నవ్య సేవలను మంగళవారం సాయంత్రం కెజిహెచ్‌లో ప్రారంభించారు. అనంతరం కొందరు కేన్సర్ బాధితుల ఆరోగ్య నివేదికలను వెబ్ పోర్టల్‌లో అప్లోడ్ చేసి జాతీయ స్థాయి నిపుణుల సలహాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని పలు ఆసుపత్రుల్లో నవ్య ప్రాజెక్టు సేవలు సమకూర్చడంలో రాష్ట్ర ప్రభుత్వానిది కీలక పాత్ర అని అన్నారు. ముఖ్యమంత్రి, సంబంధిత మంత్రులు కేంద్ర ఆరోగ్య వర్గాలతో నిరంతరం సంప్రదింపులు జరిపారని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని రీతిలో కేవలం కేన్సర్ ఆరోగ్య సేవల కోసం ఏటా రూ.600 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేస్తోందని తెలిపారు. అందులో సింహభాగం జిల్లా ఆసుపత్రులకు కేటాయించిందని తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా కేన్సర్ రోగుల ప్రత్యేక ఆరోగ్య స్థితి, తీవ్రత ఉన్న బాధితులకు అదనపు వైద్య సలహాలు, సూచనలు అందించేందుకు ఆసుపత్రి వైద్యులకు జాతీయ స్థాయి నిపుణులు తోడ్పాటునిస్తారని అన్నారు. తద్వారా సెకెండ్ ఒపీనియన్, హయ్యర్ సెంటర్ రిఫరెన్స్‌కు వెళ్ళే రోగులకు మరింత సాంత్వన దక్కుతుందని తెలిపారు. కేన్సర్ రోగుల పట్ల అపర సంజీవిని నవ్య అని డాక్టర్ ఉమేష్ మహంత్ శెట్టి పేర్కొనగా, సేవల విస్తరణకు నవ్య ఒక మార్గం కాబోతుందని రేడియేషన్ విభాగాధిపతి డాక్టర్ పాండురంగ కుమారి తెలిపారు. ఆంధ్ర మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు మాట్లాడుతూ నవ్య ద్వారా సామాన్య ప్రజలకు సేవలపై అవగాహన పెంచే కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు.

కాంగ్రెస్ దక్షిణ ఎమ్మెల్యే అభ్యర్థి రేసులో అప్పలాచారి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసే అవకాశం తనకు కల్పించాలని కోరుతూ కెజిహెచ్ విశ్రాంత అధికారి, విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధి తాళాబత్తుల అప్పలాచారి దరఖాస్తు చేశారు. ఈ సందర్భంగా విజయవాడ గాంధీభవన్‌లో విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులతో కలిసి తన దరఖాస్తును ఉత్తరాంధ్ర ఇంచార్జ్, ఎఐసిసి ఆర్గనైజేషన్ ప్రధాన కార్యదర్శి రుత్తల శ్రీరామ్‌కు అందజేశారు.

లోకేష్‌ను కలిసిన సీతంరాజు సుధాకర్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వైసిపికి రాజీనామా చేసి, ప్రస్తుతం ఏ పార్టీలోనూ లేని బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు సీతంరాజు సుధాకర్ మంగళవారం టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను కలిశారు. అనకాపల్లి జిల్లా మాడుగులలో సోమవారం టిడిపి సమావేశంలో పాల్గొన్న లోకేష్ ఆరోజు రాత్రి అక్కడే బస చేశారు. దీంతో మంగళవారం ఉదయం సీతంరాజు సుధాకర్ అక్కడే లోకేష్‌ను కలిశారు. రానున్న ఎన్నికల్లో అవకాశం ఇస్తే తెలుగుదేశం పార్టీ తరపున విశాఖ దక్షిణ నియోజకవర్గం నుంచి తాను పోటీ చేస్తానని, తనకు అవకాశం కల్పిస్తే అక్కడ విజయం సాధించి వస్తానని వివరించారు. నియోజకవర్గంలో గత కొన్నాళ్లుగా తాను చేస్తున్న సేవా కార్యక్రమాలను వివరిస్తూ, ఒక నివేదికను అందజేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. నియోజకవర్గంలో సేవా కార్యక్రమాలను కొనసాగించాలని, ప్రజలతో నిత్య సంబంధాలు కలిగి ఉండాలని లోకేష్ చెప్పినట్లు తెలిసింది. అయితే టిక్కెట్‌పై ఎటువంటి హామీ ఇవ్వలేదన్నట్లుగా తెలిసింది. లోకేష్‌తో జరిగిన చర్చలు సానుకూలంగా ఉన్నాయని సుధాకర్ తెలిపారని ఆయనకు మద్దతు ఇస్తున్న ఒక కార్పొరేటర్ ప్రజాశక్తికి తెలిపారు.

కేంద్రీయ విద్యాలయం మూసివేతపై ధర్నా

ప్రజాశక్తి-ఉక్కునగరం : కేంద్రీయ విద్యాలయం మూసివేత ప్రతిపాదనను తక్షణం విరమించుకోవాలని సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు డిమాండ్ చేశారు. స్టీల్ సిఐటియు, మిత్రపక్షాల ఆధ్వర్యంలో ఉక్కునగరం కేంద్రీయ విద్యాలయం ఎదుట మంగళవారం నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం బయట ప్రచారంలో ఒకరకంగానూ, ఆచరణలో వేరొక రకంగానూ వ్యవహరిస్తోందని విమర్శించారు. నిర్వాసితులు, ఉక్కు ఉద్యోగుల పిల్లలకు విద్య అందించాల్సిన ప్రధాన బాధ్యత నుంచి యాజమాన్యం తప్పుకోవడం అత్యంత దుర్మార్గమని అన్నారు. కనుక ఇటువంటి ప్రతిపాదనలను యాజమాన్యం తక్షణం ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ దీనిని 1983లో ప్రారంభించారని, 1050 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని అన్నారు. వీరి భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చే యాజమాన్య వైఖరి అత్యంత దుర్మార్గమని వివరించారు. కేంద్రీయ విద్యాలయానికి నేటి వరకు యాజమాన్యం అందిస్తున్న ఆర్థిక సహాయ సహకారాలు ఇకపైనా అందించాలని డిమాండ్ చేశారు.

కేంద్రీయ విద్యాలయం వద్ద ధర్నా చేస్తున్న నాయకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి మాట్లాడుతూ ఇప్పటి నుంచే రానున్న విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ఇవ్వట్లేదని తీవ్రంగా విమర్శించారు. విద్యార్థుల సంఖ్య ఒక సెక్షన్‌కు 40కి మించరాదని, కానీ నేడు అది 80 వరకూ ఉందని అన్నారు. ఉపాధ్యాయుల సంఖ్య కూడా తక్కువగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో స్టీల్ సిఐటియు అధ్యక్షులు వైటి.దాస్, మిత్రపక్షాల నాయకులు డివి.రమణా రెడ్డి, శ్రీనివాస్, మొహిద్దీన్, మహేష్, విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులు నవ్య జ్యోతి, పద్మావతి, హేమ, వినీల, తారకేష్, ప్రసాద్, ప్రదీప్, భాస్కర్, సత్యానంద, ప్రతాప్ పాల్గొన్నారు.

ఉద్యోగుల ఆర్థిక బకాయిల సాధనకు

27న చలో విజయవాడ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రావలసిన ఆర్థిక బకాయిల సాధన కోసం ఈ నెల 27న చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల జెఎసి జిల్లా చైర్మన్ కె.ఈశ్వరరావు తెలిపారు. కలెక్టరేట్ ఆవరణలోని ఎన్జీవో కార్యాలయం ఎదుట మంగళవారం పెద్ద ఎత్తున నిరసన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 3 లక్షల 80 వేల మంది ఉద్యోగులు ఉన్నారన్నారు. నాలుగున్నర సంవత్సరాలుగా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల, ఉపాధ్యాయుల, పెన్షనర్ల పట్ల అవలంబిస్తున్న తీరుకు తమ నిరసనను తెలియజేశామన్నారు. అనేక పర్యాయాలు మంత్రివర్గ ఉప సంఘం, జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాల్లో చర్చించి వినతి పత్రాలను అందజేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా జెఎసి కన్వీనర్ ఆర్.రవిశంకర్, ఎన్‌ఎంయు నేత మూర్తి, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టిఆర్.అంబేద్కర్, ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నాయుడు, డిటిఎఫ్ నాయకులు ధర్మేందర్ రెడ్డి, పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల జిల్లా అధ్యక్షుడు ఎస్.సత్తిబాబు పాల్గొన్నారు.

అభివాదం చేస్తున్న నాయకులు

అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ తూర్పు నియోజకవర్గం 17వ వార్డు ఆదర్శ నగర్ కాలనీలో మంగళవారం పలు అభివృద్ధి పనులకు రూ.25 లక్షలతో విశాఖ పార్లమెంట్ సభ్యులు ఎంవివి.సత్యనారాయణ కార్పొరేటర్ గేదల లావణ్యతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం వార్డులో పర్యటించారు.

CHANGE OF NAME

I, **KAKARA SANKHARARAO**, S/o. KAKARA DEMUDU, Age 42 years, D.No:71-31-1027, Kakaralove, Gandhigram Post Mulagada, Visakhapatnam, Andhrapradesh, India pincode :530 005,

I have changed My name from **KAKARA SANKHAR** (Old name) to **KAKARA SANKHARA RAO** (new name), hence after all PURPOSE and correspondence will continue with my new name **KAKARA SANKHARA RAO**

మహారాజశ్రీ విశాఖపట్నం ప్రిన్సిపల్ జిల్లా జడ్జి వారి కోర్టులో
G.O.P 01/2024

తామర్ల అప్పలరాజు ...పిటీషనరు
మరియు
నిల్ ...రెస్పాండెంట్లు

జనరల్ నోటీసు

ఇందుమూలంగా యావన్మందికీ తెలియజేయునది ఏమనగా పిటీషనరు అయిన తామర్ల అప్పలరాజు గారి కుమార్తె మైనరు అయిన తామర్ల ప్రీతికి డాక్యుమెంట్ నెం. 1710/2015రు గల తేది. 30-03-2015న రిజిష్టర్డు క్రయదస్తావేజు మూలంగా అక్కిరెడ్డి మహాలక్ష్మి నాయుడు వగైరాల వలన సంక్రమించిన అనకాపల్లి జిల్లా, సబ్బవరం మండలం, అక్కిరెడ్డిపాలెం విలేజ్, S.No. 154/17 రులో చేరిన ది. 0-16సెంట్లు లేక 0-064 హెక్టార్లు మెట్టు భూమిని మైనరు కుమార్తె అయిన తామర్ల ప్రీతి విద్య మరియు స్కూలు ఫీజులు వగైరాల నిమిత్తం సదరు ఆస్తిని నేచురల్ గార్డియన్, తండ్రి అయిన పిటీషనరు తామర్ల అప్పలరాజు పిటీషన్ షెడ్యూలు ఆస్తిని విక్రయించుటకు పిటీషనరు పై నెంబరు పిటీషను దాఖలు చేసియున్నారు. అందు నిమిత్తము ఎవ్వరికైననూ ఎటువంటి ఆక్షేపణలు ఉన్నయెడల వాయిదా అయిన తేది. 28-02-2024న ఉ॥గం॥10.30ని॥లకు స్వయంగాగాని, వకీలు ద్వారా గాని పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు ఉన్నయెడల శ్రీ కోర్టు వారికి తెలియపర్చుకోవలెను. యావన్మందికీ ఈ జనరల్ నోటీసు మూలంగా తెలియపరచడమైనది.

(By Order of the Hon'ble Court)
S. ESWARA RAO, Advocate
Lakshmi Nivasam, Birla Jn.,
Visakhapatnam. **Cell: 94415 95993**

IN THE HON'BLE COURT OF THE II ADDL. SENIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM
I.P. 5/2024

Between:
Konada Satyavathi,
W/o. Kondalarao, Hindu,
Aged about 37 years,
R/at D.No.40-2-406/2,
Shanthinagar, Kailasapuram,
Saligrampuram,
Visakhapatnam-530024
...Petitioner

And:
Guntu Kamesh and 8 others
...Respondents

GENERAL NOTICE

The public are hereby informed that the above petitioner filed the above I.P. No.5/2024 on the file of Hon'ble II Addl. Senior Civil Judge Court at Visakhapatnam to declare him as an insolvent and the matter stands posted to **26-02-2024** for hearing. So public are hereby informed that any objections can be raised in the above case before the Hon'ble Court **26-02-2024** either in person or through an Advocate at **10:30 A.M.**

(By Order of the Hon'ble Court)
CHENNA SATISH,
Advocate
Bheemunipatnam,
Visakhapatnam Dist.-531163
Cell: 7702345422

మహారాజశ్రీ కాకినాడ 4వ అడిషనల్ జిల్లా జడ్జి వారి కోర్టులో

I.A. 600/2023, 601/2023, 602/2023 in **O.S. 228/2017**

Between:
శింగంపల్లి యర్రయమ్మ, వగైరా
-వాద్యు/పిటీషనర్లు
మరియు
శింగంపల్లి బంగార్రాజు (died) వగైరా
-ప్రతివాద్యు/రెస్పాండెంట్లు

1) చొక్కాకుల విజయకుమార్, S/o. late ముత్యాలరావు, 311, అభి నక్షత్ర, సర్జాపూర్ రోడ్డు, ముల్లూర్, బెంగుళూరు - 560035.
2) చొక్కాకుల కిషోర్‌కుమార్, S/o. late ముత్యాలరావు, డో.నెం. 9-114, పాండురంగ నగర్, మోతీనగర్, యర్రగడ్డ, హైదరాబాద్-18.
3) బుల్లిపల్లి రాజరాజేశ్వరి, W/o. మురళీకృష్ణ, దేవరపల్లి, చోడవరం మండలం, అనకాపల్లి జిల్లా.

పై నంబరు దావాలో చనిపోయిన చొక్కాకుల ముత్యాలరావు గార్ని మిమ్మల్ని వారసులుగా చేర్పించమని దాఖలు చేసిన పై నెంబరు పిటీషనులో మీకు అభ్యంతరములు ఉన్న ఎడల పై కోర్టు వారి ఎదుట ది. 04-3-2024న ఉదయం గం॥ 10.30 ని॥లకు హాజరు అయి తెలియపర్చుకొనవలెను. లేని ఎడల పరోక్షముగా తీర్మానించబడును.

జి.వి.ఎస్..వినాయకరావు, అడ్వకేటు
కాకినాడ, సెల్: 9848479893

మహారాజశ్రీ 1వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం

I.A. 497/2023, FDP 6/2022
FDIA 424/2022, O.S. 886/2014

Between:
బొంతుపల్లి @ బొడ్డుపల్లి సత్య వసుంధర
-పిటీషనర్
AND

1. బొంత రమేష్‌బాబు, S/o. సూర్యనారాయణ, వయస్సు 52 సం॥లు, R/o. D.No. 2-256, వలసపాకల, వాకలపూడి శివారు, కాకినాడ మండలం, కాకినాడ జిల్లా.
2. లింగాల విజయదుర్గ, W/o. శ్రీనివాసరావు, వయస్సు 49 సం॥లు, ఫ్లాట్ నెం.8, 4వ ఫ్లోర్, సరోజిని టవర్స్, వీధి నెం. 21, CBM కాంపౌండ్, విశాఖపట్నం.
3. కిల్లంశెట్టి సాయి శైలజ, W/o. రవిప్రసాద్, ఫ్లాట్ నెం. 4, చంద్రతేజ అపార్ట్‌మెంట్, వీధి నెం.21, CBM కాంపౌండ్, విశాఖపట్నం.
-1, 2, 3 రెస్పాండెంట్లు

పై గ్రంథంలో SBI, APSB క్వార్టర్స్ బ్రాంచ్, కాకినాడ నందు బొంతు సూర్యకాంత గోల్డ్ లోన్ A/c. No. 62282408721 అకౌంట్ నందు కుదువబెట్టిన 27 గ్రాములు బంగారం ఆభరణములను, పై కోర్టు ఆర్డర్ ప్రకారం అడ్వకేట్ కమిషనర్ అయిన నేను సదరు 27 గ్రాములు బంగారు ఆభరణములను **ది. 02-3-2024న తేదీన 1వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు యందు ఉదయం 11 గంటలకు** బహిరంగ వేలం జరుపుచున్నందున ఆసక్తి గలవారు వేలంలో పాల్గొనవలసిందిగా యావన్మందికి తెలియజేయడమైనది.

డి.వెంకట్రావు, అడ్వకేట్ కమిషనర్
రాజమండ్రి
20-2-2024 సెల్: 9948258114

పత్రికా స్వేచ్ఛను కాపాడాలి

పెదగదిలి కూడలి వద్ద నిరసన, రాస్తారాకో చేస్తున్న అసోసియేషన్ సభ్యులు

ప్రజాశక్తి - యంత్రాంగం

ఆరిలోవ : అనంతపురం జిల్లా రాప్తాడు సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి దినపత్రిక ఫొటో గ్రాఫర్‌పై వైసిపి నాయకులు దాడి చేసిన సంఘటనను ఖండిస్తూ ఆరిలోవ వర్కింగ్ జర్నలిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన మంగళవారం పెదగదిలి కూడలి అంబేద్కర్ విగ్రహం వద్ద రాస్తారోకో నిర్వహించారు. అనంతరం చినగదిలి రూరల్ తహశీల్దారు శివన్నారాయణకు పత్రికా స్వేచ్ఛను కాపాడాలని, దాడి చేసిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆరిలోవ వర్కింగ్ జర్నలిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కె.కృష్ణపాత్రో, గౌరవాధ్యక్షులు పాత్రో, సహాయ కార్యదర్శి రామరాజు, ఉపాధ్యక్షులు కోట రాంబాబు, ట్రెజరర్ శ్యామ్ సుందర్, కంచుమర్తి శ్రీనివాసరావు, కృష్ణారావు, భాస్కర్, టిడిపి నాయకులు ఒమ్మి అప్పలరాజు, బుడుమూరు గోవిందు, ఒమ్మి పోలారావు తదితరులు పాల్గొన్నారు.

పిఎం పాలెం : ఫొటో గ్రాఫర్‌పై దాడిని ఖండిస్తూ మధురవాడ జర్నలిస్టు మిత్రులు మంగళవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం పిఎం.పాలెం సిఐ వై.రామకృష్ణకు వినతిపత్రం సమర్పించారు. దాడి చేసిన వ్యక్తులను చట్టపరంగా శిక్షించి, పత్రిక స్వేచ్ఛను కాపాడే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ముందుగా జివిఎంసి జోన్ -2 కార్యాలయం అంబేద్కర్ విగ్రహం వద్ద పత్రికా స్వేచ్ఛను కాపాడాలని నినదించారు. అంబేద్కర్ విగ్రహం నుంచి పిఎం పాలెం పోలీస్ స్టేషన్ వరకు శాంతియుత ర్యాలీ నిర్వహించారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి -మధురవాడ : మారికవలస సబ్‌స్టేషన్ పరిధి 11కెవి ఇండస్ట్రియల్ ఫీడర్‌పై మరమ్మతుల నిమిత్తం బుధవారం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్న జోన్-3 డిఇ పి.శ్రీనివాసరావు తెలిపారు. మారికవలస, బోరవానిపాలెం, మారికవలస జెఎన్‌ఎన్‌యుఆర్‌ఎం.కాలనీ, బోరవానిపాలెం డ్రైవర్స్ కాలనీ, జెకె.లే-అవుట్, కొత్త పరదేశిపాలెం, పాత పరదేశిపాలెం ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఆర్‌వి.పురం పాఠశాలను సందర్శించిన ఎల్‌ఐపి

ప్రజాశక్తి- పద్మనాభం : మండలంలోని ఆర్‌వి.పురం జిల్లా పరిషత్ హైస్కూల్‌ను స్టేట్ ఎల్‌ఐపి టీమ్-1 సభ్యులు మంగళవారం సందర్శించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పాఠశాలలోనే ఉండి విద్యార్థుల విద్యా బోధనపైనా, 6, 7, 8 తరగతుల విద్యార్థుల పాఠ్య, నోటు పుస్తకాలను నలుగురు సభ్యులు తనిఖీ చేశారు. పాఠశాలలో ఉన్న లైబ్రరీ, సైన్స్ ల్యాబ్‌ను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డైట్ వైస్ ప్రిన్సిపల్ భారతమ్మ, ఎంఇఒ పి.రమణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.శంకరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్ర నగరాల కార్పొరేషన్ చైర్మన్‌గా పోతిన శ్రీనివాస్

ప్రజాశక్తి -పిఎం.పాలెం : రాష్ట్ర నగరాల కార్పొరేషన్ చైర్మన్‌గా మధురవాడ విలకవానిపాలెం ప్రాంతానికి చెందిన వైసిపి నాయకుడు పోతిన శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం అధికారికంగా రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా పోతిన శ్రీనివాస్ మాట్లాడుతూ, వైసిపిని నమ్ముకొని నిలిచిన ప్రతి నాయకునికీ పార్టీ తగిన గుర్తింపునిస్తుందన్నారు. పదవి అప్పగించినందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి, ఉత్తరాంధ్ర జిల్లాల వైసిపి రీజనల్ కో-ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డికి, వి.విజయసాయిరెడ్డికి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు, పార్టీ జిల్లా అధ్యక్షులు కోలా గురువులు తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానని, నగరాల అభ్యున్నతికి కృషి చేస్తానని చెప్పారు.

బిఎల్‌ఒలకు అవగాహన

ప్రజాశక్తి -యంత్రాంగం

భీమునిపట్నం : ఎన్నికల విధులు, బాధ్యతలపై బూత్ స్థాయి అధికారులకు మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ టి.గోవింద్ మాట్లాడుతూ, ఓటరు నమోదు, చేర్పులు, మార్పులు, ఒకే ఓటరుకు రెండు చోట్ల ఓటు హక్కు ఉండడం, వలస ఓటర్ల గుర్తింపు తదితరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అర్హత కలిగిన వారికి ఓటు హక్కు లేకపోతే అందుకు బిఎల్‌ఒలు పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. పోలింగ్ కేంద్రం బయట మాత్రమే విధులు నిర్వర్తించాలని, ఎన్నికల విధులు, బాధ్యతల పట్ల నిర్లక్ష్యం వద్దని స్పష్టం చేశారు. నియోజకవర్గ స్థాయిలో బూత్ స్థాయి అధికారులుగా నియమితులైన 348 మంది గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు అవగాహన సదస్సులో పాల్గొన్నారు. ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ డి.భాస్కరరావు, జివిఎంసి ఒకటో జోన్ ఎసిపి శ్రీనివాసరావు, ఎఎస్‌ఒ శేషాద్రి పాల్గొన్నారు.

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న తహశీల్దార్ గోవింద్

సీతమ్మధార : జివిఎంసి 24, 26, 43 వార్డులకు సంబంధించిన పోలింగ్ బూత్ ఏజెంట్లతో రాష్ట్ర నెడ్ క్యాప్ చైర్మన్ కెకె.రాజు మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటర్ల జాబితాను పూర్తిస్థాయిలో పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు కోలా గురువులు, జివిఎంసి ఫ్లోర్‌లీడర్ బాణాల శ్రీనివాసరావు, కార్పొరేటర్లు సాడి పద్మారెడ్డి, పెద్దిశెట్టి ఉషశ్రీ, వైసిపి నాయకులు పీలా వెంకట లక్ష్మి, జి.వి.రమణి, బగాతి విజయ్, బులుసు జగదీష్, బూత్ కన్వీనర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

అధికారులతో సమీక్షిస్తున్న కెకె.రాజు

ప్రజాశక్తి -సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పనులు, ఇంకా జరగాల్సిన పనులకు సంబంధించి ఉత్తర నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో జివిఎంసి అధికారులతో రాష్ట్ర నెడ్ క్యాప్ చైర్మన్ కెకె.రాజు మంగళవారం సమీక్ష నిర్వహించారు. అభివృద్ధి పనులను నాణ్యతతో నిర్వహించాలన్నారు. మిగిలి ఉన్న పనులను వేగవంతంచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇఇ రత్నాకర్‌రెడ్డి, డిఇలు భరణి, శ్రీనివాసరావు, ఎఇలు శ్రీనివాసరావు, ఉమామహేశ్వరరావు, రమణమ్మ, రత్నాకర్, సాయినాథ్, చాణుక్య, సతీష్, నిహారిక, వర్క్ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల జగనన్న 'ఆరోగ్య సురక్ష'

ప్రజాశక్తి-యంత్రాంగం

విశాఖ జిల్లాలో పలుచోట్ల మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించారు. వైద్యులు తనిఖీలు చేసి మందులు అందజేశారు.

ఆనందపురం : మండలంలోని పాలవలసలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సచివాలయంలో ఏర్పాటుచేసిన శిబిరంలో ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు ఎం.గంగునాయుడు, షేక్ సహనాజ్ సారధ్య, కెజిహెచ్ స్పెషలిస్ట్ వైద్యులు పాల్గొని వివిధ గ్రామాల నుంచి వచ్చిన 545 మంది రోగులను పరీక్షించారు. ఈ సందర్భంగా ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎంఎల్‌హెచ్‌పిలు యోగా శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఉమావతి, స్థానిక సర్పంచ్ నాగోతి అచ్చమ్మ, మండల డెవలప్‌మెంట్ అధికారి అప్పలనాయుడు, సామాజిక ఆరోగ్య అధికారి పి.సాంబమూర్తి, ఆరోగ్య పర్యవేక్షకులు డి.పార్వతమ్మ, ఆరోగ్య సిబ్బంది, సిహెచ్‌ఒ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పద్మనాభం : మండలంలోని పద్మనాభం గ్రామ సచివాలయం వద్ద నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో 624 మందిని వైద్యులు పరీక్షించారు. అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కంటికి సంబంధించి 48 మంది పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో రేవిడి పిహెచ్‌సి వైద్యాధికారి సంధ్య, సిబ్బంది శ్రీనివాస్, మురళి, ఆశా వర్కర్లు, ఎఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి -మధురవాడ : పిఎం.పాలెం పోలీస్ స్టేషన్ పరిధి లా కాలేజీ రోడ్డులో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. 40 నుంచి 45 సంవత్సరాల వయసున్న పురుషుని మృతదేహం లభ్యమైనట్లు పిఎం పాలెం సిఐ తెలిపారు. మృతుడు యాచకుడు అయి ఉంటాడని భావిస్తున్నారు.

పట్టుబడిన గంజాయితో పోలీసులు

120 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-రోలుగుంట : ముందుగా అందిన సమాచారం మేరకు మండలంలోని అర్ల సెంటర్‌లో ఎస్ఐ సురేష్ ఆధ్వర్యంలో పోలీసులు నిఘా పెట్టి, ఆటోలో తరలిస్తున్న 120 కేజీల గంజాయిని పట్టుకున్నారని కొత్తకోట సిఐ ఎల్.అప్పలనాయుడు తెలిపారు. మంగళవారం సాయంత్రం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, రోలుగుంట మండలం అర్ల గ్రామం వద్ద నిర్వహించిన తనిఖీల్లో గంజాయితోపాటు దాన్ని తరలిస్తున్న నలుగురిని అరెస్టు చేశామన్నారు. పట్టుబడిన వారిలో అర్ల గ్రామానికి చెందిన బాణం ధర్మరాజు, రత్నంపేటకు చెందిన బోడెపు గంగన్న, చలపతి స్వామినాయుడు, బిబి.పట్నం గ్రామానికి చెందిన అప్పలనాయుడులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఆటోతో పాటు బైక్‌ను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

మద్యం బాటిళ్లతో మహిళ అరెస్ట్

ప్రజాశక్తి-గొలుగొండ : ండల కేంద్రంలో అక్రమంగా మద్యం అమ్ముతున్నారన్న ముందస్తు సమాచారంతో ఒక పాన్ షాప్‌పై దాడులు నిర్వహించి, అమ్మకానికి అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం సీసాలను సీజ్ చేసి, మహిళను అరెస్టు చేశామని ఎస్ఐ కృష్ణారావు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గొలుగొండలో ఒక పాన్ షాపులో అనుమతులు లేకుండా మద్యం అమ్ముతున్నారనే సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి దాడి చేశామన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నీ

ప్రజాశక్తి-ఆనందపురం : కీర్తిశేషులు పిన్నింటి అప్పలరాజు జ్ఞాపకార్థంగా ఎన్‌వి.పాలెం యూత్ ఆధ్వర్యాన 16 రోజులుగా నిర్వహించిన పిన్నింటి రాజు మెమోరియల్ టోర్నమెంట్ మంగళవారం బిపివి కల్లాలు క్రికెట్ గ్రౌండ్‌లో ముగించారు. 64 జట్లు పాల్గొనగా పెందుర్తి మరిడిమాంబ వారియర్స్ విన్నర్‌గా, సంగివలస డెకత్‌వానిపాలెం జట్టు రన్నర్స్‌గా నిలిచారు. విన్నర్స్‌కు రూ.50 వేలు, రన్నర్స్‌కు రూ.25 వేలు ప్రైజ్‌మనీ, మెమోంటోలను నిర్వాహకులు అందించారు. క్రీడలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ద సిరీస్, బెస్ట్ ప్లేయర్ అవార్డులను స్థానిక నాయకులు ద్వారా అందజేశారు. ఈ కార్యక్రమంలో లోడగలవానిపాలెం మాజీ సర్పంచ్ లోడగల రమణ, బమ్మిడి సూర్యనారాయణ, బీపీ కల్లాలు సర్పంచ్ కోన పైడిరాజు శ్రీనివాసరావు, జనసేన మండల ప్రెసిడెంట్ తమ్మిన అప్పలరాజు, ఎంపిటిసి మాజీ సభ్యులు లొడగల వెంకట్రావు, కంచి బోయిన శ్రీను, పిన్నింటి రాజు కుటుంబీకులు పాల్గొన్నారు.

అభయాంజనేయ ఆలయ ప్రతిష్ట

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 9వ వార్డు పరిధి సింహగిరి కాలనీలో అభయాంజనేయ స్వామి ఆలయ ప్రతిష్ట మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా తలశిల విజయ మోహన్, వార్డు టిడిపి ఇన్‌ఛార్జి బుడుమూరు గోవిందు పాల్గొని స్వామివారిని దర్శించుకొని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవాధ్యక్షులు సీరం ఈశ్వరరావు, అధ్యక్షులు అనుగుపిల్లి ఎర్రయ్య, సభ్యులు అనుగుపిల్లి ఈశ్వరరావు, త్రినాథ్, వెంకటరావు, వెంకటేశ్వరరావు, విగ్నేశ్వర యూత్ పాల్గొన్నారు.

ఎస్‌బిఐ సేవలపై అవగాహన

ప్రజాశక్తి -తగరపువలస : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) శాఖల ద్వారా ఖాతాదారులకు అందిస్తున్న వివిధ రకాల సేవలను వివరిస్తూ మంగళవారం స్థానికంగా పలు ప్రాంతాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఏ విధమైన రుణాలు, ఎంత వడ్డీకి లభిస్తాయి తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఉద్యోగులు, సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిట్టివలస, తగరపువలస, సంగివలస ఎస్‌బిఐ బ్రాంచి మేనేజర్లు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమ్మె ఒప్పందాలను అమలుచేయాలని ధర్నా

జ్ఞానాపురం జోనల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి-యంత్రాంగం

మున్సిపల్ కార్మికులు 16 రోజుల పాటు సమ్మె సందర్భంగా ప్రభుత్వం చేసిన ఒప్పందాన్ని అమలుచేయాలని డిమాండ్ చేస్తూ జోనల్ కార్యాలయాల వద్ద కార్మికులు మంగళవారం ధర్నా నిర్వహించారు.

కంచరపాలెం : జ్ఞానాపురంలోని జోన్-5 కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా యూనియన్ జోన్ కార్యదర్శి ఒ.అప్పారావు మాట్లాడుతూ, 16 రోజుల సమ్మె అనంతరం జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేసిన ఒప్పందాన్ని ఇప్పటికీ అమలు చెయ్యకపోవడం దారుణమన్నారు. రూ.21 వేలు కనీస వేతనం ఇచ్చేలా, కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేసేలా జిఒ ఇవ్వాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జోన్ అధ్యక్షులు వి.మహేశ్వరి, సిఐటియు నాయకులు యుఎస్ఎన్.రాజు, జి.శ్రీను, మున్సిపల్ నాయకులు పి.రాజు, వై.నూకరాజు, సత్యవతి, బి.రమణ, దుర్గారావు, కొండమ్మ, వినోద్, వేలంగిరావు, శివ, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పిఎం పాలెం : ఎపి మున్సిపల్ అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్, సిఐటియు ఆధ్వర్యాన జివిఎంసి మధురవాడ జోనల్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. వైసిపి ప్రభుత్వం చేస్తున్న అన్యాయంపై పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా యూనియన్ ఉప ప్రధాన కార్యదర్శి ఎంవి ప్రసాద్, సిఐటియు జోన్ అధ్యక్షులు డి.కొండమ్మ మాట్లాడుతూ, సమ్మె కాలంలో జరిపిన చర్చలకు సంబంధించిన హామీలను నేటికీ అమలుచేయకపోవడం దారుణమన్నారు. చర్చల్లో ఇచ్చిన హామీ మేరకు జిఒ విడుదల చేయాలని, లేకుంటే మళ్లీ సమ్మెలోకి వెళ్లాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జోన్ ఉపాధ్యక్షులు డి.అప్పలరాజు, సిహెచ్.శేషుబాబు, కె.నాగరాజు, వి.నర్సియ్యమ్మ, బి.శుభ, డి.సూరిబాబు, బి.నర్సింగరావు, కె.కొండమ్మ, మేరీ అమ్మ తదితరులు పాల్గొన్నారు.

మధురవాడలో జోనల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

షటిల్ కోర్టులను ప్రారంభిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

క్రీడలతో ఆరోగ్యం, ఆనందం

ప్రజాశక్తి-విశాఖపట్నం : క్రీడలు వ్యక్తి మానసిక, శారీరక ఆరోగ్యానికి ఎంతో ఉపకరిస్తాయని ఏయూ వీసీ ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ కార్యాలయం పక్కనే నూతనంగా అభివృద్ధి చేసిన షటిల్ కోర్టులను ఆయన ప్రారంభించారు. కార్యాలయం సిబ్బంది స్వచ్ఛందంగా స్పందించి, తమ చుట్టూ ఉన్న ప్రాంగణాన్ని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలనే ఉద్దేశం కలిగి ఉండటం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. వర్సిటీ ఉద్యోగులు సైతం క్రీడల్లో భాగం కావడం పట్ల ఆయన హర్షం తెలిపారు. ఉద్యోగులు మరింత సమర్థవంతంగా తమ సేవలను అందించడానికి శారీరక వ్యాయామం, క్రీడలు ఉపయుక్తంగా నిలుస్తాయన్నారు. వర్సిటీలో మరిన్ని క్రీడా ప్రాంగణాలలను అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎ.నరసింహారావు, క్రీడా విభాగాధిపతి ఆచార్య ఎ.పల్లవి, సంచాలకులు ఆచార్య ఎన్.విజయ్ మోహన్, డీన్ ఆచార్య జి.వీర్రాజు, ప్రిన్సిపల్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అభివృద్ధి ఎక్కడ ?

ఎమ్మెల్యే గణబాబు

ప్రజాశక్తి -గోపాలపట్నం : రాష్ట్రంలో విధ్వంస పాలన తప్ప అభివృద్ధి ఎక్కడ ఉందని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే పెతకంశెట్టి గణబాబు ప్రశ్నించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అభివృద్ధి, సంక్షేమం, ప్రాజెక్టులు, మౌలిక సదుపాయాల కల్పన వంటివి చంద్రబాబు పాలనలోనే ఉన్నాయన్నారు. జగన్మోహన్‌రెడ్డి పాలనలో అసమర్థత, అధికార దుర్వినియోగం కనిపిస్తున్నాయని విమర్శించారు. దీంతో రాష్ట్ర ప్రగతి మూలన పడిందన్నారు. ప్రజలకు జగన్మోహన్‌రెడ్డి రూ.10 ఇచ్చి రూ.100 తీసుకుంటున్నారని ఆరోపించారు. అసమర్థ పాలన వల్ల రాష్ట్రానికి, ప్రజలకు ఆదాయం లేదన్నారు. ఖర్చులు పెరుగుదల వల్ల సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఇక్కట్లు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో చంద్రబాబు ప్రవేశపెట్టిన 120 పథకాలను రద్దు చేశారని తెలిపారు. చంద్రబాబు పేరు చెబితే దళితులకు సబ్ ప్లాన్, 11 డిఎస్‌సిల ద్వారా 1.50 లక్షల మంది ఉపాధ్యాయ పోస్టుల భర్తీ, అన్నా క్యాంటీన్లు చంద్రన్న బీమా. ఇరిగేషన్ ప్రాజెక్టులు తదితర ఎన్నో పథకాలు గుర్తొస్తాయని పేర్కొన్నారు. జగన్మోహన్‌రెడ్డి పేరు చెబితే బాబాయి గొడ్డలి, కోడి కత్తి శీను. గంజాయి వంటివి గుర్తొస్తాయని ఎద్దేవాచేశారు.

వైసిపి రాష్ట్ర సేవాదళ్ సంయుక్త కార్యదర్శిగా గవర నాయుడు

ప్రజాశక్తి -గోపాలపట్నం : జివిఎంసి 89వ వార్డు సంతోషనగర్ ప్రాంతానికి చెందిన గవరనాయుడును వైసిపి రాష్ట్ర సేవాదళ్ సంయుక్త కార్యదర్శిగా నియమించింది. ఈ మేరకు విశాఖ పశ్చిమ నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ నియామక పత్రాన్ని విడుదల చేశారు. గవరనాయుడు వైసిపి ఆవిర్భావం నుంచి పార్టీ అభివృద్ధికి కృషి చేశారు. గతంలో వైసిపి జిల్లా కార్యదర్శిగా పనిచేశారు. ఈ సందర్భంగా గవరనాయుడు మాట్లాడుతూ తనపై నమ్మకంతో రాష్ట్ర స్థాయి పదవినివ్వినందుకు ఆనంద్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి గెలుపునకు తన శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. తనకు పార్టీలో ప్రోత్సాహం అందించిన ఐతంసెట్టి రేణుక, గోపాలకృష్ణ, ఇతర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఐద్వా జాతీయ సమావేశాల పోస్టర్ ఆవిష్కరణ

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఐద్వా నాయకులు

ప్రజాశక్తి -ములగాడ : ఐద్వా మల్కాపురం జోన్ కమిటీ ఆధ్వర్యాన గుల్లలపాలెంలో జాతీయ సమావేశాల పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్.విమల మాట్లాడుతూ, నేడు మహిళలపై దాడులు హత్యాచారాలు, మానభంగాలు జరుగుతుంటే కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్ని చట్టాలు ఉన్నా న్యాయం జరగడంలేదన్నారు. దేశంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు విశాఖలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో జరిగే జాతీయ సమావేశాల్లో చర్చించి భవిష్యత్తు కార్యచరణ రూపొందిస్తామని తెలిపారు. ఈ పోస్టర్ ఆవిష్కరణలో ఐద్వా మల్కాపురం జోన్ అధ్యక్షులు బి.మమత, కె.ఈశ్వరమ్మ, పి.పుణ్యవతి, కృష్ణవేణి, హేమ, రుద్ర, సుజాత తదితరులు పాల్గొన్నారు.

నేడు రాజశ్యామలయాగంలో సిఎం జగన్

శారదా పీఠంలో ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి-పెందుర్తి : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బుధవారం విశాఖ శారదాపీఠంలో నిర్వహించే రాజశ్యామల యాగంలో పాల్గొంటారు. ముఖ్యమంత్రి బుధవారం ఉదయం 11.40 గంటలకు శారదా పీఠానికి చేరుకొని సంప్రదాయ వస్త్రధారణతో రాజశ్యామల అమ్మవారిని దర్శించుకుంటారు. ఆ తర్వాత పీఠార్చనలో పాల్గొంటారు. పీఠం ప్రాంగణంలోని దేవతామూర్తుల ఆలయాలను సందర్శిస్తారు. అనంతరం యాగశాలలో జరిగే రాజశ్యామల యాగం పూర్ణాహుతిలో పాల్గొంటారు. తర్వాత పీఠాధిపతులు స్వరూపానందేంద్ర స్వామి ఆశీస్సులు తీసుకుని తిరిగి పయనమవుతారు.

శారదాపీఠంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

శారదా పీఠంలో ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పూర్తయ్యాయి. మంగళవారం ఉదయం మున్సిపల్ కమిషనర్ సాయికాంత్‌వర్మ, పోలీసు అధికారులు పీఠం ప్రాంగణంలో ఏర్పాట్లను పరిశీలించారు. విమానాశ్రయం నుంచి పీఠం వరకూ పోలీసులు ట్రయల్ రన్ నిర్వహించారు.

పరిశ్రమల ప్రగతిలో మెకానికల్ ఇంజినీర్లు కీలకం

ప్రజాశక్తి -మధురవాడ : పారిశ్రామిక ప్రగతిలో మెకానికల్ ఇంజినీర్లదే కీలక పాత్ర అని, ముఖ్యంగా నూతన సాంకేతిక పరిజ్ఞానంతో పరిశ్రమల ఉత్పాదక శక్తిని పెంచాల్సిన బాధ్యత మెకానికల్ ఇంజినీర్లపై ఉందని ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ (ఇండియా) విశాఖ డైరక్టర్ ఎమ్.రవీంద్రనాథ్ పేర్కొన్నారు. గీతం మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యాన మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ డిజిటలీకరణ వైపు కదులుతోందని, హరిత టెక్నాలజీల వినియోగానికి ప్రాధాన్యత పెరుగుతోందని చెప్పారు. ఆటోమేషన్, రోబోటిక్ రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులు మెకానికల్ ఇంజినీర్లకు కొత్త అవకాశాలను సృష్టిస్తున్నాయని తెలిపారు. పారిశ్రామిక ఉత్పత్తులలో నాణ్యత పెరగడానికి, ప్రపంచ పోటీని తట్టుకుని నిలవడానికి, ఉత్పాదక సామర్థ్యం పెరగడానికి అవసరమైన నూతన సాంకేతిక పరిజ్ఞానం యువ ఇంజినీర్లు అభివృద్ధి చేయాలని సూచించారు. ఐటి రంగం కారణంగా మెకానికల్ ఇంజినీరింగ్ వంటి కోర్సులలో చేరే యువత సంఖ్య తగ్గటం ఆందోళన కలిగిస్తోందన్నారు. అయితే నూతన ఆవిష్కరణలు, నైపుణ్యాలు గల యువతకు మెకానికల్ ఇంజినీరింగ్ రంగంలో ఉజ్వల అవకాశాలు ఎదురు చూస్తున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా దేశంలోని ఉక్కు పరిశ్రమల రంగం ఎదుర్కొంటున్న సవాళ్లను, అవకాశాలను ఆయన వివరించారు. 2030-31 సంవత్సరం నాటికి దేశంలో తలసరి స్టీల్ ఉత్పత్తి 160 కేజీలు సాధించే లక్ష్యంతో దేశీయ ఉక్కు పరిశ్రమలు కృషి చేస్తున్నాయని చెప్పారు. స్టీల్ పరిశ్రమలో యంత్రాల నిర్వహణలో లోపం తలెత్తకుండా పర్యవేక్షించడం, నాణ్యతా ప్రమాణాలు పాటించడం, భద్రత వంటివి విజయానికి దారి తీస్తాయని తెలిపారు. కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరక్టర్ ప్రొఫెసర్ నాగేంద్ర ప్రసాద్, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

రవీంద్రనాథ్‌ను సత్కరిస్తున్న గీతం ప్రతినిధులు

డ్రెయినేజీ వ్యవస్థ ఏదీ?

నిల్వ చేరుతున్న అపార్ట్‌మెంట్ మురుగు నీరు

ప్రజాశక్తి-పెందుర్తి

జివిఎంసి 95వ వార్డు పరిధి మరిడమాంబ కాలనీ హౌసింగ్ బోర్డు సమీపంలో అపార్ట్‌మెంట్ నుంచి వచ్చిన మురుగు నీరు నిల్వ చేరుతోంది. ఈ మురుగు నీరు పోవడానికి డ్రెయినేజీ వ్యవస్థ నిర్మించలేదు. డ్రెయినేజీ వ్యవస్థ లేకుండా అపార్ట్‌మెంట్ నిర్మాణానికి ఎలా అనుమతులిచ్చారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఈ మురుగు నీటితో దోమలు ప్రబలుతున్నాయి. డయేరియా, డెంగీ వ్యాధులు విజృంభిస్తాయేమోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇప్పటికైనా మురుగు నీరు పోయే ఏర్పాట్లు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

లబ్ధిదారులకు కల్యాణమస్తు, షాదీ తోఫా

అనకాపల్లిలో రూ.3.57 కోట్లు, విశాఖలో 1.93 కోట్లు జమ

ప్రజాశక్తి-అనకాపల్లి

వైఎస్ఆర్ కల్యాణమస్తు, షాదీ తోఫా కింద అనకాపల్లి జిల్లాలో 604 జంటలకు రూ.3కోట్ల 57 లక్షల 20 వేలు జమ చేసినట్లు జిల్లా కలెక్టరు రవి పట్టన్ శెట్టి తెలిపారు. మంగళవారం తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుండి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కల్యాణమస్తు, షాదీ తోఫా విడుదల కార్యక్రమం చేపట్టగా, అనకాపల్లి జిల్లా కలెక్టరు కార్యాలయం నుండి దానిని తిలకించారు. అనంతరం జిల్లా కలెక్టరు లబ్ధిదారులకు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రవి మాట్లాడుతూ కొత్తగా వివాహం చేసుకున్న వారిలో అర్హులైన వారందరూ కళ్యాణమస్తు, షాదీ తోఫాకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. జిల్లాలో బిసి-ఎకు చెందిన 74 జంటలకు రూ.37.50 లక్షలు, బిసి-బికి చెందిన 51 జంటలకు రూ.28.75 లక్షలు, బిసి-డికు చెందిన 406 జంటలకు రూ.2కోట్ల,14లక్షల 75 వేలు, బిసిఈకి చెందిన మూడు జంటలకు రూ. 3 లక్షలు, ఓసికి చెందిన ఒక జంటకు రూ.1లక్షా 50 వేలు, ఎస్‌సికి చెందిన 63 జంటలకు రూ.64.90 లక్షలు, ఎస్‌టికి చెందిన 6 జంటలకు రూ.6.80 లక్షలు వారి ఖాతాలలో జమచేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్‌పి వైస్ ఛైర్‌పర్సన్ బి.వరాహసత్యవతి, డిఆర్‌డిఎ పిడి శచీదేవి, ఎపిడి డైజి, బిసి సంక్షేమ శాఖ ఏడి అజయ్ బాబు పాల్గొన్నారు.

చెక్కు అందజేస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి తదితరులు

విశాఖ కలెక్టరేట్ : వైఎస్ఆర్ కల్యాణ మస్తు, షాదీ తోఫా ద్వారా వధువు తల్లిదండ్రులకు ఆర్థిక చేయూత చేకూరుతుందని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ అన్నారు. ఈ పథకం వల్ల జిల్లాలోని ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ, వికలాంగులు, భవన కార్మికుల కుటుంబాల్లోని ఆడ పిల్లలకు రూ.1.93 కోట్ల ఆర్థిక ప్రయోజనం కలుగుతుందని వివరించారు. వైఎస్ఆర్ కల్యాణ మస్తు, వైఎస్ఆర్ షాదీ తోఫా ఐదో విడత నిధుల పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో మంగళవారం ప్రారంభించి, బటన్ నొక్కి తల్లుల ఖాతాల్లో జమచేశారు. విశాఖ జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో జెసితో పాటు రాష్ట్ర నగరాలు సంక్షేమాభివృద్ధి సంస్థ ఛైర్‌పర్సన్ పి.సుజాత, సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు కె.రామారావు, డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం.ఎస్.శోభారాణి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

వ్యక్తిగత ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదు

ప్రజాశక్తి-చోడవరం : టిడిపి నాయకులు వ్యక్తిగత ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని ప్రభుత్వ విప్, స్థానిక శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ హెచ్చరించారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం చోడవరం నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమం కోసం రూ.3 వేల కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. ఇది చూడని లోకేష్ వడ్డాదిలో జరిగిన టిడిపి శంఖారావం సభలో నియోజకవర్గానికి చెందిన టిడిపి నాయకులు చెప్పిన అబద్ధాలను మాట్లాడడం సరికాదన్నారు. టిడిపి నాయకులు చేపట్టిన అక్రమ క్వారీల వల్ల బ్రిడ్జిలు, రోడ్లు శిథిలమయ్యాయన్నారు. గోవాడ ఫ్యాక్టరీలో టిడిపి నాయకులు అవినీతికి పాల్పడి కోట్ల సంపాదించిన విషయాన్ని మరిచిపోయారా? అని ప్రశ్నించారు. గత టిడిపి ప్రభుత్వంలో నీరు-చెట్టు పథకంలో బత్తుల తాతయ్య బాబు చేసిన అవినీతి బయట పెడతామని హెచ్చరించారు. జనసేన నాయకులు పివిఎస్ఎన్.రాజు నిర్వాకం అందరికీ తెలుసన్నారు. ఈ సమావేశంలో డీసీఎంఎస్ చైర్మన్ పల్లా నర్సింగరావు, వైసిపి మండలం అధ్యక్షుడు దొడ్డి వెంకటరావు, నాయకులు గొర్లె సూరిబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యరావు పాల్గొన్నారు.

పిల్లలకు హెల్మెట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

రహదారి భద్రత అందరి బాధ్యత

ప్రజాశక్తి -అనకాపల్లి : రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని ట్రాఫిక్ ఎస్సై నరసింగరావు పేర్కొన్నారు. స్థానిక గాంధీనగర్‌లో క్రియేటివ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఇండియన్ హెడ్ ఇంజురీస్ ఫౌండేషన్, హీరో మోటా కంపెనీ సహకారంతో సాయి శక్తి గవర్నమెంట్ ఎయిడెడ్ హైస్కూల్‌లో రోడ్ సేఫ్టీ అవేర్నెస్ క్యాంపు నిర్వహించారు. ఎల్‌కెజి టు థర్డ్ క్లాస్ పిల్లలు (8 సంవత్సరాల లోపు) పిల్లలు 195 మందికి హెల్మెట్స్ ఎస్ఐ నర్సింగరావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్సై మాట్లాడుతూ తల్లిదండ్రులే కాకుండా పిల్లలు కూడా హెల్మెట్లు ధరించి ప్రయాణం చేయాలని సూచించారు. రోడ్డు మీద ప్రయాణించేటప్పుడు తప్పనిసరిగా రోడ్ సేఫ్టీ నియమాలు పాటించాలన్నారు. హైస్కూల్ పిల్లలకు నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖన పోటీల్లో విజేతలకు ఎస్ఐ చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో సాయి శక్తి స్కూల్ ప్రిన్సిపాల్ రాజశేఖర్, క్రియేటివ్ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి మల్ల నాగేశ్వరావు, వైష్ణవి స్కూల్ ప్రిన్సిపాల్ నాగరాజు, సరస్వతి విద్యానికేతన ప్రిన్సిపాల్ వర్మ, ప్రణతి స్కూల్ ప్రిన్సిపాల్ సతీష్, ట్రాఫిక్ కానిస్టేబుళ్ళు, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

పూడిమడక జాతరకు పక్కాగా ఏర్పాట్లు చేయాలి

ప్రజాశక్తి-అచ్యుతాపురం

పూడిమడకలోని జరుగు మాఘ పౌర్ణమి జాతరకు ఎటువంటి ఇబ్బందులు జరగకుండా పక్కాగా ఏర్పాట్లు చేయాలని స్థానిక సిఐ ఎం.బుచ్చిరాజు అన్నారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో మంగళవారం పూడిమడక ప్రజాప్రతినిధులతో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సముద్ర తీరంలో శుక్ర, శని రెండు రోజులపాటు సముద్రస్నానాలు చేయడానికి వచ్చే భక్తులకు ప్రజలకు అనుకూలంగా తీరాన్ని పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. తీరంలో బోట్లను దూరంగా తరలించాలని, స్నానాలు చేసే సమయంలో దుస్తులు మార్చుకోవడానికి అనుకూలంగా ఏర్పాటు చేయాలని, జాతరలో ఎటువంటి ఘర్షణలు పడరాదని స్పష్టం చేశారు. జాతరకు వచ్చే వారు బంగారం ఆభరణాలు ధరించకుండా రావాలన్నారు. ఈ సమావేశంలో పూడిమడక మాజీ సర్పంచ్ చేపల వెంకటరమణ, గ్రామ ఉపసర్పంచ్ గంగిరి రవి, పెంటయ్య పాల్గొన్నారు.

క్రీడల్లో మరిన్ని విజయాలు సాధించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

క్రీడల్లో మరిన్ని విజయాలు సాధించి జిల్లాకు పేరు తీసుకురావాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి అన్నారు. ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలలో విజయం సాధించిన ఖోఖో, కబడ్డీ జట్లును జాయింట్ కలెక్టర్ అభినందించారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎల్‌వి రమణ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం సాధించిన తుమ్మపాల-2 ఖోఖో జట్టు, రాష్ట్ర స్థాయిలో తృతీయ స్థానం పొందిన సాలపువానిపాలెం కబడ్డీ జట్టు జాయింట్ కలెక్టరును మంగళవారం ఆమె ఛాంబర్‌లో కలిశారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ మరింత శిక్షణ తీసుకుని జాతీయ జట్టుకు ఎంపిక కావాలన్నారు. ఈ కార్యక్రమంలో కోచ్ పివి నాగేశ్వరరావు, కబడ్డీ కోచ్, ఫిజికల్ డైరెక్టర్లు డిఎస్.శ్యాంప్రసాద్, సత్యవతి, ఖోఖో జట్టు కెప్టెన్ నవీన్, కబాడీ జట్టు కెప్టెన్ కె.త్రివేణి, ఇతర క్రీడాకారులు పాల్గొన్నారు.

క్రీడాకారులను అభినందిస్తున్న జెసి జాహ్నవి

ప్రాంగణ నియామకాల్లో నలుగురు ఎంపిక

ప్రజాశక్తి -అనకాపల్లి : స్థానిక ఎంఎంఎల్ కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో ఆ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారు. అగ్రికల్చర్, డైరీయింగ్ అనిమల్ హస్బెండ్రీ కోర్సుల నుండి ఫిబ్రవరి 19న అమూల్ డెయిరీ సంస్థ ఫీల్డ్ సూపర్వైజర్స్ కోసం ప్రాంగణ ఎంపికను చేపట్టి నలుగురు విద్యార్థులను ఎంపిక చేసింది. 2022-23లో ఉత్తీర్ణులైన సిహెచ్. పవన్ కళ్యాణ్, పి.గణేష్, జి.శ్రావణి డైరీయింగ్ అనిమల్ హస్బండరీ నుండి, వై.దొరబాబు అగ్రికల్చర్ నుండి నెలకు సుమారు 20వేల రూపాయలు జీతానికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జి జయబాబు తెలిపారు. కళాశాల యాజమాన్య ప్రతినిధులు ఒకేషనల్ కోర్సు కోఆర్డినేటర్ డాక్టర్ వై వేణుగోపాల్‌ను అభినందించారు.

సిఐటియు చొరవతో గిరిజనులకు కూలి డబ్బులు

గిరిజనులకు కూలి డబ్బులు అందిస్తున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రాము

ప్రజాశక్తి-అచ్యుతాపురం

ఎలమంచిలి సమీపంలోని పులపర్తిలో వైశాలి మెరైన్ రొయ్యల పరిశ్రమ నిర్మాణ పనుల్లో 20 రోజుల పాటు సెంట్రింగ్ పనులు చేసిన గిరిజన కూలీలకు మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో కూలి డబ్బులు ఇప్పించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగూడ మండలానికి చెందిన 20 మంది యువకులు రొయ్యల పరిశ్రమ నిర్మాణ పనులు చేశారు. చేసిన పనికి కూలి డబ్బులు కాంట్రాక్టరు ఇవ్వలేదు. దీంతో గిరిజనలకు తినడానికి తిండి లేక తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఈ సమస్యను సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము దృష్టికి తీసుకొచ్చారు. దీనికి స్పందించిన రాము గిరిజన కూలీల సమస్యపై ఎలమంచిలి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీంతో కాంట్రాక్టర్‌ను రప్పించి గిరిజన కూలీలకు కూలి డబ్బులు ఇప్పించారు. గిరిజన కూలీలకు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం ఎస్ఇజెడ్ కార్మికుడు సంతోష్ తన సొంత ఖర్చుతో అందించారు. సిఐటియు నాయకులు చేసిన సహకారానికి గిరిజన కూలీలు గొల్లూరి మోహన్, బురిడి సాయి, గొల్లూరి భీమన్న, కుర్ర రమేష్ తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

యోగా సాధనతో ఆరోగ్యం

ప్రజాశక్తి- అనకాపల్లి : యోగా సాధనతో ఆరోగ్యం సిద్ధిస్తుందని స్వామి పరమార్ధదేవ్ పేర్కొన్నారు స్థానిక జార్జి క్లబ్లో మంగళవారం సమీకృత యోగ సెషన్ నిర్వహించారు. అభ్యాసకులచే ఆయన పలు యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగ సాధనతోనే ప్రపంచం మొత్తం ఆరోగ్యంగా ఉందన్నారు. పతంజలి యోగ భారత్ స్వాభిమాన ట్రస్ట్ జిల్లా అధ్యక్షులు భీశెట్టి దొరమ్మ నాయుడు, స్వామి పరమార్ధ దేవ్, రిథిదేవ్ స్వామి, సచిన్‌జీ, రాష్ట్ర అధ్యక్షులు చిన్న బాబు, జొన్నలగడ్డ శ్రీనివాస్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చూసి ఓర్వలేకే మంత్రిపై విమర్శలు

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని ఓర్వలేకే ఆయనపై ప్రతిపక్ష పార్టీల నాయకులు లేనిపోని అవాకులు చవాకులు మాట్లాడుతున్నారని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ అన్నారు. స్థానిక రింగ్‌రోడ్‌లోని వైసిపి కార్యాలయంలో వైసిపి పట్టణ అధ్యక్షులు మందపాటి జానకి రామరాజు అధ్యక్షతన మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో భరత్‌కుమార్ మాట్లాడారు. నియోజకవర్గంలో ఎంత అభివృద్ధి జరిగిందని, ప్రతిపక్ష నేతలు కళ్ళు తెరిచి చూడాలని హితవుపలికారు. 2014లో చంద్రబాబు ఇచ్చిన 600 హామీల్లో ఏ ఒక్కటి పూర్తిస్థాయిలో నెరవేర్చలేదన్నారు. అదే జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీల్లో 99 శాతానికి పైగా అమలు చేసినట్లు చెప్పారు. ఏపీఈడబ్ల్యూఐ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్ మాట్లాడుతూ మంత్రి అమర్నాథ్‌ను గుడ్డు మంత్రిగా అభివర్ణిస్తున్న వారికి రానున్న ఎన్నికల్లో గాంధీ బొమ్మ దగ్గర ప్రజలు గుండు గీయించి పంపడం ఖాయమన్నారు. మాజీ ఎమ్మెల్యే సారా గోవింద, కబ్జా గోవిందగా పేరు బడి, ఆయనపై టిడిపి ప్రభుత్వ హయాంలోనే 420 కేసు నమోదైన సంగతి మరిచారా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, వైసిపి నాయకులు పెద్దిశెట్టి గోవింద, కలగా గున్నయ్య నాయుడు, బొడ్డేడ శివ, దాడి నారాయణరావు, పలక సత్యనారాయణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త భరత్‌కుమార్

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో ప్రతిభ

ప్రజాశక్తి- సబ్బవరం : ఆడుదాం ఆంధ్ర క్రీడల్లో రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో స్థానిక రేంజర్స్ డిఫెన్స్ అకాడమీ విద్యార్థి జయవర్ధన్‌కు ద్వితీయ బహుమతి లభించింది. ఈ మేరకు మంగళవారం జయవర్ధన్‌ను కళాశాలలో ఘనంగా సత్కరించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న స్థానిక సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పోతల సత్యనారాయణ, డిఫెన్స్ అకాడమీ పిడి సురేష్, ఇన్‌ఛార్జి సూరిబాబు, దేవి, అశ్విని, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కన్యకా పరమేశ్వరి శోభాయాత్ర ప్రారంభం

ప్రజాశక్తి- అనకాపల్లి : అనకాపల్లి పట్టణంలోని శ్రీకన్యకా పరమేశ్వరి దేవస్థానం ఆధ్వర్యంలో భీష్మ ఏకాదశికి 100 సంవత్సరంలో ప్రవేశిస్తున్న శుభ సందర్భంగా 108 మంది మహిళలచే 108 కళాశాలతో శోభాయాత్ర ఆలయ వద్ద నుండి మంగళవారం ప్రారంభమైంది. రేజేటి రామాచార్యులు ఆధ్వర్యంలో భీష్మ ఏకాదశి సందర్భంగా చేపట్టిన ఈ యాత్ర మెయిన్ రోడ్డు, పెరుగు బజార్ జంక్షన్, చిన్న వీధి, మల్లవరపు వారి వీధి మెయిన్ రోడ్డు మీదగా ఆలయానికి చేరుకుంది. అడుగడుగునా అమ్మవారికి భక్తులు హారతిలిచ్చి దర్శించుకున్నారు. కార్యక్రమంలో శత జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు, కో చైర్మన్ డాక్టర్ గ్రంధి శేషు కుమార్, ఆలయ అధ్యక్షులు బిళ్ళపాటి కృష్ణ కుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు. ఉత్సవ కమిటీ చైర్మన్ వుప్పల శ్రీనివాసరావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గాలమ్మ తీర్థ మహోత్సవం

ప్రజాశక్తి-సబ్బవరం : సబ్బవరం మేజర్ పంచాయతీ పరిధిలోని శ్రీ దుర్గాలమ్మ తల్లి అమ్మవారి తీర్థం మహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఉదయం 5 గంటల నుండి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం ప్రాంగణంలో భక్తులు ఆర్థిక సహాయంతో ప్రసాదం పంపిణీ చేశారు. సాయంత్రం 4 గంటల నుండి స్వామి గరిడీలు, చిటికెలు భజనలు, కోలాటం, అమ్మవారి వేషాలు, తీన్మార్ డప్పులు, భారీ మందు గుండు సామాగ్రితో ఘనంగా తీర్థ మహోత్సవం జరిగింది. రాత్రి 7 గంటల నుండి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఆంజనేయస్వామి తీర్థం

అచ్యుతాపురం : మండల కేంద్రం మోసయ్యపేటలో మంగళవారం ఆంజనేయ స్వామి తీర్థ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో భక్తులు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ నిర్వాహకుల ఆధ్వర్యంలో అన్న సమారాధన ఏర్పాటు చేశారు. తప్పెడుగుళ్లు, కోలాటాలు పోటీలు ఏర్పాటు చేశారు.

గణేష్ రెడ్డికి సత్కారం

ప్రజాశక్తి- అనకాపల్లి : స్థానిక సబ్ జైల్ సూపరింటెండెంట్ గణేష్ రెడ్డిని మంగళవారం అనకాపల్లి జిల్లా ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు డాక్టర్ చిన్నియాదవ్, ప్రధాన కార్యదర్శి ఆళ్ల ప్రవీణ్ కుమార్, ఉపాధ్యక్షులు బండి అప్పారావు, కోశాధికారి బొడ్డు సోమరాజు, సహాయక కార్యదర్శి బొబ్బిలి గోవిందరాజులు, ముగడా అప్పారావు, తమ్మిన అప్పారావు, ఉప్పల సాయి పాల్గొన్నారు.

టిడిపిలో చేరిన సన్యాసినాయుడు

ప్రజాశక్తి -కశింకోట : మండలంలోని అచ్చర్ల గ్రామానికి చెందిన నిమ్మదల సన్యాసినాయుడు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. అనకాపల్లిలో జరిగిన టీడీపీ శంఖారావం సభలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సమక్షంలో ఆయన టిడిపిలో చేరారు. దీర్ఘకాలం పాటు కాంగ్రెస్ పార్టీలో పని చేసిన ఆయన తరువాత వైసిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, ఆయన తనయుడు దాడి రత్నాకర్ పాల్గొన్నారు. సన్యాసినాయుడు టిడిపిలో చేరడం పల్ల అచ్చర్ల టిడిపి గ్రామ అధ్యక్షుడు నైనంశెట్టి రమణారావు హర్షం వ్యక్తం చేశారు.

సన్యాసి నాయుడుకు టిడిపి కండువా వేస్తున్న లోకేష్

వైసిపిలో భగ్గుమన్న విభేదాలు

ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా మీడియా సమావేశం

విలేకర్ల సమావేశంలో పాల్గొన్న వడ్డాది సర్పంచ్ లక్ష్మి, నాయకులు

ప్రజాశక్తి -వడ్డాది

వైసీపీలో విభేదాలు భగ్గుమన్నాయి. ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ వ్యవహార శైలిపై వడ్డాది వైసీపీ నేతలు మండిపడ్డారు. మంగళవారం వడ్డాదిలో వారు స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దళిత మహిళలైన తనను ఎమ్మెల్యే తీవ్రంగా అవమానిస్తున్నారని సర్పంచ్ కోరుకొండ కామ లక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ, పార్టీ కార్యకలాపాలకు తమకు కనీస సమాచారం ఇవ్వడం లేదన్నారు. తమకు తెలియకుండానే పంచాయతీలో అగ్రవర్ణాలకు చెందిన వారి ద్వారా కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని, రాజ్యాంగం తమకు కల్పించిన హక్కులకు ఎమ్మెల్యే భంగం కలిగిస్తున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే ప్రోత్సాహంతో తమపై అగ్రవర్ణాల వ్యక్తి దొండా నారాయణమూర్తి పెత్తనం చెలాయిస్తున్నారని ఆరోపించారు. బీసీ సామాజిక తరగతికి చెందిన ఉపసర్పంచ్ దాడి సూర్యనాగేశ్వరావు కూడా ఎమ్మెల్యే తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పిఏసీఎస్ అధ్యక్షులు దొండా సన్యాసిరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే ధర్మశ్రీ వైఖరి వల్ల పార్టీకి దళిత బడుగు బలహీన వర్గాలు దూరమవుతున్నారన్నారు. ఎమ్మెల్యే అవినీతిని ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే తీరు మార్చుకోకపోతే తాము పార్టీని వీడక తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో స్థానిక వైసీపీ నాయకులు కోరుకొండ సూర్య అప్పారావు, దాడి పెద్ద గోవింద, కుబిరెడ్డి వెంకటరావు, పొలిమేర కృష్ణ, వీర్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్గత రహదారులకు అధిక ప్రాధాన్యత

డిప్యూటీ సిఎం బూడి ముత్యాలనాయుడును సన్మానిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి- కె.కోటపాడు : మాడుగుల నియోజకవర్గంలో మారుమూల గ్రామాలను కలుపుతూ అంతర్గత రహదారులకు అధిక ప్రాధాన్యత ఇచ్చినట్లు ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. మండలంలోని ఎ.కోడూరు, వి.సంతపాలెం గ్రామాల్లో సచివాలయాలు, ఆర్‌బికెలు, ఆరోగ్య కేంద్రాలు, పొడుగుపాలెంలో వాటర్ ట్యాంకు, వారాడలో బీటీ రోడ్డు, సింగన్నదొరపాలెంలో అంగన్వాడీ కేంద్రం తదితర అభివద్ధి పనులను మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ తాను పంచాయతీరాజ్ గ్రామీణ అభివద్ధి శాఖ మంత్రిగా కొనసాగడం వల్ల నియోజకవర్గంలో సుమారు 100 రోడ్లను అభివృద్ధి పరిచినట్లు తెలిపారు. ఇప్పటివరకు ఏ ఎమ్మెల్యే చేయలేని అభివృద్ధి తన హయాంలో జరిగిందన్నారు. కె.కోటపాడు మండలంలో ఇంటింటికి కుళాయిలు నూరు శాతం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. స్థానిక 30 పడకల ఆసుపత్రిని రూ.5.6 కోట్లతో ఆధునికీకరించి 50 పడకులకు అప్ గ్రేడ్ చేశామని, లంకవానిపాలెం, చౌడువాడ పీహెచ్సీలను అభివృద్ధి చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి జగన్మోహన్, జెడ్పిటిసి ఈర్లే అనురాధ, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మండల పరిషత్తు సమావేశంలో పలు సమస్యలపై నిలదీత

తాగునీటి సమస్యపై ప్రశ్నిస్తున్న ఎంపిటిసి సభ్యులు

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపిపి గొర్లి సూరిబాబు అధ్యక్షతన మంగళవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో పలు సమస్యలపై సభ్యులు నిలదీశారు. గ్రామీణ నీటిపారుదల, విద్యుత్తు సమస్యలు, వ్యవసాయ, ఆర్ అండ్ బి, వైద్యం, మద్యం వంటి పలు సమస్యలపై సభ్యులు ప్రశ్నించారు. ప్రధానంగా రానున్న వేసవి దృష్టిలో పెట్టుకొని మంచినీటి సమస్య తలెత్తకుండా చూడాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. ఎక్సైజ్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ సిబ్బంది గ్రామాల్లో ఏరులై పారుతున్న మద్యం బెల్టు షాపులను నిరోధించాలన్నారు. దీనిపై ఎంపీపీ సూరిబాబు స్పందిస్తూ అధికారులు సభ్యులు లేవనెత్తిన సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశానికి హాజరుకాని వివిధ శాఖల అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఏపీఐడబ్ల్యూఈ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్, ఏఎంసి చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ బివి సత్యవతి, కో ఆప్షన్ సభ్యులు జోసెఫ్, ఎంపీడీవో, ఈవోపిఆర్‌డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ప్రణాళికాయుతంగా పౌష్టికాహారం అందించాలి

ప్రజాశక్తి- అనకాపల్లి : జిల్లాలో అంగన్ వాడీ కేంద్రాల ద్వారా పిల్లలు, తల్లులకు అందించే పౌష్ఠికాహార సరఫరా ప్రణాళికాయుతంగా జరగాలని జిల్లా కలెక్టరు రవి పట్టన్ శెట్టి అధికారులను ఆదేశించారు. ఈ విషయమై సోమవారం ఆయన జిల్లాలోని సిడిపివోలు, పిహెచ్‌సిల డాక్టర్లు, మండల విద్యాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పౌష్ఠికాహారంతో పాటు పండ్లు, పాలు, తృణధాన్యాలను ఎక్కువగా వాడేలా అవగాహన కల్పించాలన్నారు. రక్తహీనత గలవారిని గుర్తించి తగిన పౌష్ఠికాహారం, మందులు వాడేలా చూడాలన్నారు. ఇప్పటి వరకు చేపట్టిన చర్యలు, బాలలు, గర్భిణులలో గుర్తించిన అనారోగ్యాలు, రక్తహీనతల గురించి అరగన్వాడీ కేంద్రాలు, మండలాలు, పాఠశాలల వారీగా సమీక్షించారు. కొంతమందికి మాత్రమే రక్తహీనత కలగడానికి గల కారణాలను తెలుసుకోవాలన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ బి స్మరణ రాజ్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఏ.హేమంత్, జిల్లా విద్యాధికారి వెంకటలక్ష్మమ్మ, స్త్రీ శిశు సంక్షేమాధికారి అనంతలక్ష్మి పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని పలు గ్రామాలలో ఆరు కోట్ల 8 లక్షల రూపాయల నిధులతో నిర్మించిన భవనాలకు మంగళవారం ఎంపీ బీశెట్టి వెంకట సత్యవతి, ఎమ్మెల్యే యువి రమణమూర్తిరాజు, ఎంపిపి కోన సంధ్య, జెడ్పిటిసి లాలం రాంబాబు తదితరులు మంగళవారం ప్రారంభించారు. కాజీపాలెంలో గ్రామ సచివాలయం, ధోబీఖానా, అనకాపల్లి పూడిమడక రోడ్డు నుండి పెదపాడు మీదుగా వెదురుపర్తి బ్రిడ్జి వరకు తారురోడ్డు, రైతు భరోసా కేంద్ర భవనం, తిమ్మరాజుపేట సచివాలయ భవనం, ఎర్రవరం స్మశాన వాటిక, వాటర్ పైప్లైన్ బోర్వెల్, ఎస్సీ కాలనీలో సిసి రోడ్లు, డ్రైనేజీలు, ఎం జగన్నాథపురం గ్రామ శివాలయం, చౌడపల్లి సచివాలయ భవనం, ఆర్‌బికె, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం, చీమలాపల్లిలో సచివాలయ భవనం, హెల్త్ క్లినిక్, మడుతూరు సచివాలయ భవనం, అమూల్ బల్క్ మిల్క్ కూలింగ్ సెంటర్, హెల్త్ క్లినిక్, ఆవసోమవారంలో సచివాలయం తదితర భవనాలను ప్రారంభించారు. కార్యక్రమంలో చీమలపల్లి గ్రామ సర్పంచ్ సియాద్రి నాగ నూకరాజు, సియాద్రి బైరాగి, వైసీపీ సీనియర్ నాయకులు కోన లచ్చం నాయుడు, పి వాసు రాజు, ఎస్ లక్ష్మీ జగ్గారావు, గంగిరెడ్డి లక్ష్మి రాము, మోటూరు సంజీవ్, శనివాడ జువ్వాలనాయుడు, గొర్లి అశ్విని నూకరాజు, కోలా అప్పలరాజు, గండిబోయిన వెంకట్, భీముని వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బూత్ ఇన్‌ఛార్జులకు ప్రశంసా పత్రాలు

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : తెలుగుదేశం పార్టీ మినీ మేనిఫెస్టో బాబు షూరిటి -భవిష్యత్తు గ్యారంటీ నమోదులో అత్యంత ప్రతిభ కనబరిచిన బూత్ ఇన్‌ఛార్జులకు ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సోమవారం సాయంత్రం వడ్డాదిలో జరిగిన శంఖారావం సభలో ప్రశంసా పత్రాలు అందజేశారు. మండలంలోని వివిధ బూతులకు చెందిన 14 మంది బూత్ ఇన్‌ఛార్జులు ఈ ప్రశంసా పత్రాలు అందుకున్నారు. వడ్డాది, ఆర్.భీమవరం, బుచ్చయ్యపేట తదితర గ్రామాలకు చెందిన బూత్ ఇన్‌ఛార్జులకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బత్తుల తాతయ్యబాబు, మాజీ శాసనసభ్యులు కేఎస్ఎన్ఎస్.రాజుతో కలిపి అందజేశారు.

టిడిపిలో పలువురు చేరిక

శంఖారావం కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మండలంలోని మల్లం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గొలగాన శ్రీనివాస్ యాదవ్ తన అనుచరులతో, కొన్నెంపుడి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ అదత్రావు సత్యనారాయణ, మహేష్ తమ అనుచరులతో కలిసి లోకేష్ ఆధ్వర్యంలో టిడిపిలో చేరారు.

ఘనంగా గంగాదేవి పండగ

ప్రజాశక్తి - కశింకోట : మండలంలో జి.భీమవరం గ్రామంలో గంగాదేవి అమ్మవారి పండుగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. వైసిపి అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మలసాల భరత్ కుమార్, ఆ పార్టీ మండల అధ్యక్షులు మలసాల కిషోర్, సర్పంచ్‌లు హనుమంతు వెంకట లక్ష్మణరావు, కొట్టే రాము, చిరికి సత్యనారాయణ, ఎంపీటీసీ అల్లం శంకర్, అద్దంకి సతీష్, మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందసత్యనారాయణ, టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు దాడి రత్నాకర్, జనసేన మండల అధ్యక్షులు బుదిరెడ్డి చిన్న, పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు.

హ్యూమన్ రైట్స్ ఫెడరేషన్ నేషనల్ డైరెక్టర్‌గా చంద్రశేఖర్

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రశాంతి విద్య నికేతన్ వ్యవస్థాపకులు దొడ్డి అప్పారావు కుమారుడు డాక్టర్ దొడ్డి చంద్ర శేఖర్ హ్యూమన్ రైట్స్ ఇంటర్నేషనల్ ఫెడరేషన్‌కు నేషనల్ డైరెక్టర్‌గా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నేషనల్ ప్రెసిడెంట్ నరేంద్రర్ అరోరా చేతుల మీదుగా అపాయింట్మెంట్ లెటర్ ఢిల్లీలో అందుకున్నారు. చంద్ర శేఖర్ కన్స్యూమర్ రైట్స్ ఆర్గనైజేషన్స్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్‌గా కొనసాగుతున్నారు. ప్రశాంతి నికేతన్ స్కూల్ డైరెక్టర్‌గా ఉన్నారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌ను ప్రశాంతి నికేతన్ స్కూల్ ప్రెసిడెంట్ డివి.శ్రీనివాసరావు, పాఠశాల సిబ్బంది అభినందించారు.

ఎస్ఇజెడ్‌లో అవకతవకలపై పోరాటం

ప్రజాశక్తి అచ్యుతాపురం : ఎస్ఇజెడ్‌లోని పరిశ్రమల్లో జరుగుతున్న అవకతవకలపై పోరాటానికి టిడిపి, జనసేన, వైసిపి నాయకులు ఒక్కటయ్యారు. ఈ మేరకు స్థానిక ఎస్‌కెఆర్ లాడ్జిలో మంగళవారం ఈ మూడు పార్టీల నాయకులు సమావేశమయ్యారు. కొంతకాలంగా జరుగుతున్న అవకతవకలన్నీ వెలుగులోకి తీసుకురావడంతో వాటిపై పోరాటం చేయాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో మాజీ జెడ్పిటిసి జనపరెడ్డి శ్రీనివాసరావు, జనసేన నాయకులు బైలపూడి రామదాసు, బైలపూడి సత్యం, పైలా రామునాయుడు, టిడిపి నాయకులు ధర్మారెడ్డి నాయుడుబాబు, లాలం నాగేశ్వరరావు, వైసిపి నాయకులు ద్వారపురెడ్డి బాబ్జి, కొరుపోలు చిన్నారావు, సూరాడ ధనరాజు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన నిర్వహణపై దర్యాప్తు

విద్యార్థులను విచారిస్తున్న ఎంఇఒ బ్రహ్మాజీ

ప్రజాశక్తి -కొత్తకోట : రావికమతం మండలం టి.అర్జాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం మధ్యాహ్నం ఉడకని అన్నం పెట్టడంతో విద్యార్థులంతా ఇళ్లకు వెళ్లిపోయిన సంఘటనపై మండల విద్యాశాఖాధికారి ఎన్ బ్రహ్మాజీ మంగళవారం విచారణ చేశారు. పాఠశాలలో పలువురు విద్యార్థులను విడివిడిగా, బహిరంగంగా విచారించ గా ఉడకని అన్నం పెడుతున్నారని తెలిపారు. తర్వాత మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు పడాల దేవిని ప్రశ్నించగా అన్నం ఉడికినట్టుగా భావించి వడ్డించామని, తెలిసి చేసిన తప్పు కాదని, పునరావృతం కాకుండా చూసుకుంటామని వివరించింది. కాగా భోజన నిర్వాహకురాలు తరచూ ఇలాంటి పొరపాటునే చేస్తోందని, అధికార్లు మందలించినా తీరుమార్చుకోవడం లేదని కఠిన చర్యలు తీసుకోవాలని వైస్ ఎంపిపి మత్స భవానిప్రసాద్, విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

సామూహిక సత్యనారాయణ వ్రతాలు

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్ : మాఘ శుద్ధ ఏకాదశి సందర్భంగా నర్సీపట్నం మున్సిపాలిటీ బలిఘట్టం శ్రీసత్యనారాయణస్వామి దేవస్థానంలో మంగళవారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అర్చకులు పెరివిల్లి భద్రాచలరామం ఆధ్వర్యంలో జరిగింది.

జిఒ 11 అమలుకు వినతి

ప్రజాశక్తి - చింతపల్లి : సచివాలయ కార్యదర్శులను పంచాయతీ కార్యదర్శులుగా ప్రమోషన్లపై నియమించేందుకు జారీ చేసిన జిఒ 11ను పటిష్టంగా అమలు చేయాలని సచివాలయం కార్యదర్శులు కోరాబు శివకుమార్, లోచలి చిన్నం నాయుడు కోరారు. మంగళవారం స్థానిక ఎంపిడిఒ వి వీర సాయిబాబాకు వినతి పత్రాన్ని సమర్పించారు. దీనిపై ఎంపిడిఒ వీర సాయిబాబు స్పందిస్తూ, సచివాలయ కార్యదర్శుల వినతిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు.

'ఉక్కు' పరిరక్షణకు కేంద్రంపై ఒత్తిడి పెంచాలి

దీక్షల్లో కూర్చున్న స్టీల్‌ప్లాంట్ కార్మికులు

ప్రజాశక్తి - ఉక్కునగరం : విశాఖ ఉక్కు వంటి ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవడం దేశంలోని ప్రతి ఉద్యోగి బాధ్యతని, ఈ నేపథ్యంలో ప్లాంటును కాపాడుకోవడం కోసం అందరూ కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 1104వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో స్టీల్ ఇఎస్ అండ్ ఎఫ్, ఎఫ్ఎండి, ఇఆర్ఎస్, సేఫ్టీ, టెక్, ఎస్ఎంసిడి, ఆగ్రో విభాగాలకు చెందిన ఉద్యోగులు కూర్చున్నారు. వారినుద్దేశించి పోరాట కమిటీ ఛైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడారు. ఏకతాటిపై జరుగుతున్న ఉక్కు పరిరక్షణ ఉద్యమాలను మరింత ఉధృతం చేయాల్సి ఉందన్నారు. ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని, పూర్తి స్థాయి సామర్థ్యంతో నడపాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేయాలని చూస్తున్న కేంద్ర బిజెపిని రానున్న ఎన్నికల్లో ఓడించాలన్నారు.

ఒపిఎస్ అమలు చేయాలి: యుటిఎఫ్

స్కూల్ కాంప్లెక్స్‌లో పోస్టర్లు, పోస్టుకార్డుల ఆవిష్కరణ

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ :పాతపింఛను విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ మంగళవారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో పెద బొడ్డేపల్లి హైస్కూల్ ఇంగ్లీష్ కాంప్లెక్స్ మీటింగ్‌లో ఆందోళన చేశారు. సిపిఎస్, జిపిఎస్ రద్దు చేయాలని, ఒపిఎస్ అమలు చేయాలని కోరుతూ పోస్ట్ కార్డులను, ఓటు ఫర్ ఒపిఎస్ పోస్టర్స్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ నర్సీపట్నం మండల కన్వీనర్ అనిమిరెడ్డి సాంబమూర్తి మాట్లాడుతూ సిపిఎస్‌ను రద్దు చేసే అంశాన్ని అన్ని రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోలో పెట్టడంతో పాటు కచ్చితంగా అమలు చేస్తామని హామీ ఇవ్వాలని కోరుతూ, అన్ని రాజకీయ పార్టీల రాష్ట్ర అధ్యక్షులకు ఉత్తరాలు రాసి పోస్టు చేస్తామన్నారు.సిపిఎస్‌ను రద్దు చేసి, ఒపిఎస్ అమలు చేసే వారికి మాత్రమే ఉద్యోగ ఉపాధ్యాయులు ఓటు వేస్తారన్నారు. ఓట్ ఫర్ ఓపిఎస్ అనే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి ప్రజల్లోకి తీసుకెళతామన్నారు. కార్యక్రమంలో గొలుగొండ, నర్సీపట్నం, నాతవరం మండలాల్లోని ఇంగ్లీష్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నల్లమారమ్మ జాతరకు ముమ్మర ఏర్పాట్లు

ప్రజాశక్తి-మాకవరపాలెం: మండలంలోని కొండలఅగ్రహారంలో నల్లమారమ్మ పండగను ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ఆధ్వర్యాన ముమ్మర ఏర్పాట్లు చేస్తోంది. ఈ నెల 22న గ్రామ దేవత నల్లమారమ్మ జాతర జరుగుతుంది. మంగళవారం అమ్మవారి గరగను ఆలయం నుంచి గ్రామంలో ఊరేగించారు. పండగ రోజున భారీ అన్నసమారాధనతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్టు ఆలయ ధర్మకర్త గూడూరి వెంకటరాజు తెలిపారు.కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిటికెల రమణ, సూపర్ సర్పంచ్ పోలిరెడ్డి రమణరాజు, ఈశ్వరరావు, చిన్న పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

మాట్లాడుతున్న ఎంఇఒ మూర్తి

ప్రజాశక్తి-మాకవరపాలెం : ప్రభుత్వ ఉపాధ్యాయులందరికీ పాఠశాల సముదాయ శిక్షణ ఇస్తున్నామని ఎంఇఒ మూర్తి తెలిపారు. మాకవరపాలెం మండలంలోని గిడుతూరులో మంగళవారం ఒక రోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను పాఠశాలల్లో బోధనలో అమలు చేయాలని సూచించారు. కాంప్లెక్స్ ఛైర్మన్ బజ్జీరావ్ ఈ శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

426 మందికి ఆరోగ్య సురక్ష సేవలు

రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి -కొత్తకోట : రావికమతం మండలం చీమలపాడు సచివాలయం పరిధిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. కొత్తకోట పిహెచ్‌సి వైద్యాధికారిణి మోహిని సురేఖ ఆధ్వర్యంలో 426 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ వంజరి గంగరాజు మాట్లాడుతూ పేదప్రజలకు నాణ్యమైన ఉచిత వైద్యం గ్రామాల్లోనే అందించేందుకు సీఎం జగన్మోహనరెడ్డి ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రవేశపెట్టారని దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

శిబిరానికి వివిధ సమస్యలతో వచ్చిన పలువురు రోగులకు బిపి, సుగర్ చెక్ చేసి కౌంటర్లు వారీగా సంబంధిత వైద్యుల వద్దకు తీసుకెళ్లేందుకు వాలంటీర్లు సచివాలయ ఉద్యోగులు, కన్వీనర్లు సహకరించారు. శిబిరంలో స్పెషలిస్ట్ వైద్యులు స్మృతి, మల్లికార్జునరావు పాల్గొని రోగులకు సేవలందించారు. కార్యక్రమంలోఎంపిహెచ్ఐఒ రామారావు, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు, వాలంటీర్స్ పాల్గొన్నారు.

ఉత్సవమూర్తుల ఊరేగింపు

ప్రజాశక్తి-గొలుగొండ : భీష్మ ఏకాదశి సందర్భంగా మండలంలోని దారమఠం శివాలయంలోని ఉత్సవ విగ్రహాలను ఆలయ కమిటీ ఛైర్మన్ అల్లు సత్తిబాబు, ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షులు భీమిరెడ్డి సత్యనారాయణ, నాయులు ఆధ్వర్యంలో ఊరేగించారు. కొత్తపాలెం, గొలుగొండ, జోగుంపేట జంక్షన్, కొత్త జోగుంపేట, జానకిరాపురం, పాత మల్లంపేట గ్రామాల మీదుగా ఊరేగింపు సాగింది.కార్యక్రమంలో వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామి విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రోడ్డును విస్తరించి, పునర్నిర్మించండి

ప్రజాశక్తి -చీడికాడ : చీడికాడలో ఆర్అండ్‌బి రహదారిలో ఆక్రమణలు తొలగించి రోడ్డు పునర్నిర్మాణం చేపట్టాలని బిజెపి నేత రెడ్డి కొండబాబు కోరారు. మంగళవారం ఎంపిడిఒకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ చీడికాడ, చోడవరం ప్రధాన రహదారిని ఇటీవల జి కొత్తపల్లి నుండి చీడికాడ వరకు పునర్నిర్మాణం చేపట్టారన్నారు.అయితే రోడ్డు వెడల్పు చేస్తామని చెప్పిన ఆర్అండ్‌బి అధికారులు, ప్రస్తుతం పాత రోడ్డు స్థానే పునర్నిర్మాణం చేస్తున్నారన్నారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించి, ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా రోడ్డు విస్తరణ చేపట్టి, పునర్నిర్మించాలని కోరారు

వాలంటీర్లకు సేవా పురస్కారాలు

ప్రజాశక్తి - రావికమతం : మండల కేంద్రంలోని ఐసిడిఎస్ కార్యాలయంలో వాలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. సేవా పురస్కార గ్రహీతలైన సచివాలయ వాలంటీర్లను ఘనంగా సన్మానించారు. మండలంలోని కవగుంట, చినపాచిల, గుమ్మాలపాడు, కెబిపి అగ్రహారం, కోమీర ,రావికమతం, గర్నికం ,గ్రామాలకు చెందిన మంది వాలంటీర్లను డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ ముక్కా మహాలక్ష్మీ నాయుడు, రావికమత మండల సచివాలయ కన్వీనర్ కంచిపాటి జగన్నాథరావు, సర్పంచ్లు దాసరి వరహాలు, బంటు సన్యాసినాయుడు, కలిగిరి ప్రసాద్, కొమార ప్రసాదు, బంటు శ్రీనివాసరావు సత్కరించారు.

రావికమతంలో వాలంటీర్లకు సత్కారం

కోటవురట్ల : మండలంలోని చౌడువాడ, కైలాస పట్నం, రాజుపేట, బోడపాలెం, గ్రామాల్లో వాలంటీర్లకు మంగళవారం సేవాపురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా బోడపాలెం సర్పంచ్ ఎరుకునాయుడు మాట్లాడుతూ గ్రామాల్లో ఉత్తమ సేవలు అందిస్తున్న వాలంటీర్లకు ఆర్థిక ప్రోత్సాహకాలు, పురస్కారాలు అందించి సత్కరించడం అభినందనీయమన్నారు.

౨ వాలంటీర్లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్, ఏపీఐడబ్ల్యుసి ఛైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్, ఎంపిపి గొర్లి సూరిబాబు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, జడ్పిటిసి కో ఆప్షన్ సభ్యుడు జోసెఫ్, ఎంపీడీవో, ఈఓపిఆర్‌డి తదితరులు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : మండలంలోని బుచ్చయ్యపేట, దిబ్బిడి, కందిపూడి, కెపి.అగ్రహారం, పి.భీమవరం సచివాలయాల పరిధిలోని గ్రామ వాలంటీర్లకు మంగళవారం జెడ్పిటిసి దొండ రాంబాబు మంగళవారం ప్రశంసా పత్రాలను అందజేశారు. శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటాచార్య, సూపరింటెండెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లిలో వాలంటీర్లకు పురస్కారాలను అందజేస్తున్న ఎంపిపి

ఆనందపురం : మండలంలోని పాలవలసలో గ్రామ వాలంటీర్లను భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సన్మానించారు. వాలంటీర్ల సేవలను ప్రోత్సహిస్తూ సేవా మిత్ర, సేవా వజ్ర, సేవారత్న కేటగిరీలో ప్రోత్సాహకాలను అందించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి కోరాడ వెంకటరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకట్రావు, పార్టీ ప్రెసిడెంట్ బంక సత్యం, వైస్ ఎంపిపి పాండ్రంకి శ్రీను, నాయకులు బొట్ట రామకృష్ణ, శ్రీను, మహేష్ సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

గొలుగొండ : మండలంలోని పప్పుశెట్టిపాలెం గ్రామంలో మంగళవారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ మాకిరెడ్డి విజయకుమారి వలంటీర్లకు సేవా పురస్కారాలను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ సీఎం జగన్ అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా కృషి చేయడంలో వలంటీర్లు ప్రధాన పాత్ర పోషిస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైసిపి యూత్ అధ్యక్షులు మాకిరెడ్డి రామకృష్ణనాయుడు, పంచాయతీ కార్యదర్శి రఘు పాల్గొన్నారు. అదే విధంగా గొలుగొండలోవాలంటీర్లకు వందనం కార్యక్రమంలో సర్పంచ్ కసిపల్లి అప్పారావు(బుజ్జి) పురస్కారాలు అందజేశారు.

మాటల మరాఠీ జగన్!

- హామీలే తప్ప, చేతల్లో కానరాని అభివృద్ధి, సంక్షేమం
- ప్రజా సమస్యల పరిష్కారంలో వైసిపి నిండా నిర్లక్ష్యం
- టిడిపి శంఖారావ సభల్లో నారా లోకేష్ ధ్వజం

శంఖారావ సభలో మాట్లాడుతున్న లోకేష్

పజాశక్తి- కోటవురట్ల/మాడుగుల, నర్సీపట్నం టౌన్ : మాట తప్పను, మడమ తిప్పను అంటూ కల్లిబొల్లి కబుర్లు చెప్పి, ఇచ్చిన హామీల్లో ముఖ్యమైన వాటన్నింటినీ అమలు చేయకుండా ముఖ్యమంత్రి జగన్ ప్రజలను మభ్యపెట్టి మోసపుచ్చాడని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ధ్వజమెత్తారు. మంగళవారం మాడుగుల, నర్సీపట్నం నియోజకవర్గాల్లో నిర్వహించిన టిడిపి శంఖారావ సభల్లో మాట్లాడుతూ, సిఎం జగన్ నేతృత్వంలోని వైసిపి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమం అంతా మాటల్లోనే తప్ప చేతల్లో కనిపించడం లేదన్నారు. మద్య నిషేధమంటూ హామీనిచ్చి, దాన్ని నిర్మూలించేందుకే ధరలు పెంచుతున్నామని నమ్మబలికి, నాసిరకం మద్యంతో ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడడమే కాకుండా, మరో ముప్పైఏళ్లకు మద్యం దుకాణాలను తాకట్టు పెట్టి మహిళలను సిఎం జగన్ నయవంచనకు గురిచేశారన్నారు. ఎనిమిదిలక్షల ఎకరాలను సాగునీరు, ఉత్తరాంధ్రకు తాగునీరిచ్చే సుజల స్రవంతిని అటకెక్కించేశారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో రోడ్ల దుస్థితి వైసిపి చేతకాని పాలనకు నిలువెత్తు నిదర్శన మన్నారు పాఠశాలలకు రంగులు వేసి నాడునేడు నిధులను కైంకర్యం చేశారన్నారు. రైతు సంక్షేమ మంటూ మాయమాటలు చెప్పి, జిల్లాలోని సుగర్ ఫ్యాక్టరీలను ఆధునికీకరించి పూర్వవైభవం తెస్తానని మాటిచ్చి, వాటిని అమ్మజూపుతున్న రైతు ద్రోహి జగన్ అంటూ మండిపడ్డారు. కొత్త పరిశ్రమలు తేలేకపోగా, ఉన్న వాటిని మూసేసిన చేతకాని గుడ్డుమంత్రి అమర్ అంటూ ఎద్దేవా చేశారు. ఉత్తరాంధ్రకు పట్టిన కేన్సర్ గడ్డలు, బొత్స సత్యనారాయణ, వైవి సుబ్బారెడ్డి, విజయ సాయిరెడ్డి, అవినీతి, అక్రమాలు, దోచు కోవడం తప్ప, వైసిపి పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. విపక్షాలను దూషించే వారికి, బూతులు తిట్టేవారికి మంత్రి పదవులిస్తూ, అందలమెక్కిస్తూ, భారీ మెజార్టీతో అధికారమిచ్చిన ప్రజల నమ్మకాన్ని సిఎం జగన్ వమ్ము చేశారన్నారు. అధికారపార్టీ ఎంపీ భార్య, కొడుకు కిడ్నాప్, భూదందాలకు అడ్డుగా ఉన్న తహశీల్దార్ రమణయ్యను విశాఖ నడిబొడ్డున హత్య, మాస్క్ ఇవ్వలేదని ప్రశ్నించినందుకు నర్సీపట్నం వైద్యుడు సుధాకర్‌ను పిచ్చోడిగా చిత్రీకరించి, చనిపోయేలా చేయడం వంటివి జగన్ పాలనలోని అకృత్యాలకు నిదర్శనాలన్నారు పంచాయతీల నిధులను దారిమళ్లించడం, ఎస్‌సిలకు చెందిన 27 సంక్షేమ పథకాలకు మంగళంపాడడం, టిడిపి, జనసేన పొత్తుతో వైసిపి అరాచక పాలనకు చరమగీతం పలకడం ఖాయమని, రాష్ట్రానికి మంచి రోజులు రానున్నాయని లోకేష్ అన్నారు. ఉమ్మడి మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి చింతకాయల అయ్యన్న పాత్రుడు, ఎమ్మెల్సీ చిరంజీవి రావు వంగలపూడి అనిత, బుద్ధ నాగజగదీశ్వరరావు, పీలా గోవింద్ సత్యనారాయణ, గవిరెడ్డి రామానాయుడు, పైలా ప్రసాదరావు, పంచకర్ల రమేష్‌బాబు, రాయపు రెడ్డి కృష్ణ, చింతకాయల విజయ్, గడ్డం బుజ్జి, సూర్యచంద్ర అధిక సంఖ్యలో టిడిపి, జనసేన నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న లోకేష్

ప్రతిజ్ఞ చేస్తున్న టిడిపి, జనసేన నేతలు

సిఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గణేష్

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్ : పలువురు బాధితులకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన ఆర్థికసాయం చెక్కులను నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ మంగళవారం పంపిణీ చేశారు. అమలాపురం గ్రామానికి చెందిన బొట్టా కృష్ణ లావణ్యకు రూ.4లక్షలు, చెట్టుపల్లికి చెందిన గవిరెడ్డి వెంకటలక్ష్మికి రూ.లక్ష, ఆది కుమారికి రూ.27వేలు, దుగ్గాడ గ్రామానికి చెందిన నల్లబెల్లి సత్యవతి రూ.20వేలు మొత్తం రూ.5.47లక్షల చెక్కులను అందించారు.కార్యక్రమంలో వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

టెన్త్ నమూనా పరీక్ష
విజేతలకు బహుమతుల అందజేత



విజేతలకు బహుమతులు అందజేస్తున్న పాఠశాల ప్రతినిధులు

ప్రజాశక్తి -పాయకరావుపేట : ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో నిర్వహించిన 10వ తరగతి మాక్ పరీక్షల్లో పాయకరావుపేట శ్రీచైతన్య స్కూలు విద్యార్థులు గర్లంక గీతాశ్రీ, సూరకాసుల రవి జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాలలో నిలిచారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు మంగళవారం . స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం భవానీ మాట్లాడుతూ విద్యార్థుల్లో పబ్లిక్ పరీక్షల పట్ల ఉన్న భయాలను పోగొట్టడానికి, వారిలో దాగి ఉన్న నైపుణ్యం, ప్రతిభను గుర్తించడానికి ఇటువంటి నమూనా పరీక్షలు ఎంతగానో దోహదపడతాయని, వీటి నిర్వహణకు చొరవ చూపిన ఎస్ఎఫ్ఐ ప్రతినిధులను అభినందించారు. ఎస్ఎఫ్ఐ నమూనా పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను శ్రీచైతన్య ఎజిఎం సురేష్, ఆర్ఐ గోపీనాథ్, అకడమిక్ కోఆర్డినేటర్ వెంకటరమణ, ప్రిన్సిపల్ మాణిక్యాలరావుతోపాటు ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు బహుమతులను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల డీన్ విజయ్, ఎఒ విజయ్, సి. బ్యాచ్ ఇన్‌ఛార్జి లోవేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళలకు స్వయం ఉపాధి శిక్షణ

అవగాహన కల్పిస్తున్నజివి.రావు

ప్రజాశక్తి-రోలుగుంట : మండలంలోని బుచ్చంపేట గ్రామంలో సేవాభారత్ కోఆర్డినేటర్ జివి.రావు వయోజన విద్యా కేంద్రంలో చదువుకుంటున్న 30 మంది మహిళలకు స్వయం ఉపాధి శిక్షణ ఇచ్చారు. మహిళలు ఖాళీ సమయంలో కొన్ని రకాల ఉత్పత్తులను తయారు చేసి, వాటిని అమ్మట ద్వారా ఆదాయం సంపాదించే మార్గాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా సర్ఫ్, ఫెనాయిల్, నీలిమందు, హెర్బల్ హెయర్ ఆయిల్ వంటి వివిధ రకాల ఉత్పత్తులు తయారీ విధానాన్ని వివరించారు.

ఉపాధి పనిదినాలను పెంచాలి

పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రలను కేంద్రం మానుకోవాలి

ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.లోకనాథం

కూలీలతో మాట్లాడుతున్న లోకనాథం

ప్రజాశక్తి - చీడికాడ : ఉపాధి హామీని కూలీలకు పని దినాలను 200 రోజులకు పెంచాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు మంగళవారం మండలంలోని చిన్న గోగాడ గ్రామంలో ఉపాధి హామీ పనులను పనిప్రదేశానికి వెళ్లి పరిశీలిం చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం అమలుతో కూలీల వలసలు తగ్గాయని, అటువంటి పథకాన్ని నిధులను తగ్గించడం ద్వారా నిర్వీర్యం చేయాలని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చూస్తోందని దుయ్యబట్టారు. ఉపాధి కూలీలకు వేసవి అలవెన్స్ ఇవ్వాలని, పలుగు, పార పంపిణీ చేయాలని, పని ప్రదేశంలో నీడకు టెంట్‌ల ఏర్పాటు, ప్రథమ చికిత్స కిట్, మజ్జిగ పంపిణీ వంటి చర్యలు చేపట్టాలని కోరారు.

కొన్ని మండలాల్లో ఉపాధి కూలీలకు ఇప్పటికీ బకాయిలు చెల్లించకుండా తాత్కారం చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నా రన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడంలో భాగంగా ఎఫ్ఆర్ఎస్ రికగ్నైజేషన్ చేయాలని చెబుతోందని, దీనివల్ల ఈ పథకానికి గండికొట్టినట్టేనన్నారు. మేట్లకు సెల్‌ఫోను ఇవ్వకుండానే ఆన్లైన్ పనులు చేయాలని చెప్పడం సరికాదని, జట్టు మేట్‌లకు వేతనాలు చెల్లించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకానికి నిధులు కేటాయింపు పెంచాలని డిమాండ్ చేశారు కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు తదితరులు పాల్గొన్నారు

సమస్యలపై మధ్యాహ్న భోజన కార్మికుల వినతి

లోకేష్‌కు వినతిపత్రం ఇస్తున్న భోజన కార్మికులు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : తమ సమస్యల పరిష్కారం కోసం టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు మిడ్డేమిల్ కార్మికులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ మీడ్డేమీల్ పథకం ప్రైవేటీకరణ చేయరాదన్నారు. మెనూ ఛార్జీలు పెంచాలని, పథకంలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. బీమా, ఇతర సౌకర్యాలను కల్పించాలని కోరారు. దీనిపై లోకేష్ స్పందిస్తూ, టిడిపి, జనసేన ప్రభుత్వం త్వరలో అధికారంలోకి వస్తుందని, భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించి, న్యాయం చేసేందుకు కృషి చేస్తానని హామీనిచ్చారని భోజన కార్మికులు తెలిపారు.ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కె.ప్రసన్న, జగది, వై.సత్యకళ పాల్గొన్నారు.

ప్రతి అక్షరం - ప్రజల పక్షం
ప్రజాశక్తి దినపత్రిక
విలేకర్లు కావలెను
ప్రజాశక్తి దినపత్రికలో పనిచేసేందుకు క్రింది తెలిపిన కేంద్రాల్లో విలేకర్లు కావలెను.
అర్హత : ఇంటర్ ఉత్తీర్ణత, జర్నలిజంపై ఆసక్తి, సమస్యల పట్ల అవగాహన
-: విలేకరులు కావలసిన ప్రాంతాలు :-
అగనంపూడి, కూర్మన్నపాలెం, పూర్ణామార్కెట్, వన్‌టౌన్, అల్లిపురం, సాగర్‌నగర్, డాబాగార్డెన్స్, మద్దిలపాలెం, సిరిపురం, ఎ.యు., క్రైం రిపోర్టర్, జిల్లా పరిషత్, రాంపురం, ఎన్ఎడి జంక్షన్, కంచరపాలెం, పెదగంట్యాడ, అనకాపల్లి రూరల్
ఇంటర్వ్యూ : తేది 26-02-2024 సోమవారం ఉదయం 10 గంటలకు
సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు : 94900 99125, 94915 70765
ప్రజాశక్తి ఎడిషన్ కార్యాలయం : ప్లాట్ నెం.3 'జి' బ్లాక్, ఇండస్ట్రీయల్ పార్క్, వడ్లపూడి, ఆటోనగర్, విశాఖపట్నం-46